తెలుగు జాతీయ దినపత్రిక

తెలంగాణ

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి:02 సంచిక :223 హైదరాబాద్: సంపాదకులు : గున్నాల అనిల్ రెడ్డి 26 మంగళవారం నవంబర్ 2024 పేజీలు : 12 వెల:రూ.5/-

Published from : Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, and Bhadradri Kothagudem, , Vijayawada, Vishakapatnam, Kurnool, Anantapur



## సీఎం రేసులో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే

**ముంబై, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి అనూహ్య విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. అయితే, ఇప్పుడు సీఎం ఎవరన్నది..? ఓ పెద్ద ప్రశ్నగా మారింది. ముఖ్యమంత్రి పదవికోసం దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే ఇద్దరూ పోటీ పడుతున్నారు.

వివరాలు 2లో

భాగస్వామ్య పార్టీలు కలిసి

## నిర్ణయం తీసుకుంటా

ముఖ్యమంత్రి పదవిపై స్పందించిన అజిత్ పవార్

**న్యూఢిల్లీ,నవంబర్25తెలుగు వెలుగు :**

మహారాష్ట్రలో "మహాయుతి" కూటమి 236 సీట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే సీఎం పదవి రేసులో ఫడ్నవీస్ ముందున్నారు. సీఎం, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే కూడా అదే పదవిలో కొనసాగాలనుకుంటున్నారు. అత్యధిక సీట్లు గెలుచుకున్న తమ పార్టీకి సీఎం పదవి రావాలని బీజేపీ చెబుతోంది.



వివరాలు 2లో

# స్కిల్ వర్సిటీ విరాళం 100 కోట్లు వెనక్కి

## ఆదానీ డబ్బులు తీసుకోరాదని నిర్ణయం

ఢిల్లీకి ఎన్నిమార్లయినా వెళుతూనే ఉంటాం

కెటిఆర్ జైలుకెళ్లడానికి తహతహలాడుతున్నారని ఎద్దేవా

విమర్శల నేపథ్యంలో సిఎం రేవంత్ ప్రకటన

**హైదరాబాద్,నవంబర్ 25తెలుగు వెలుగు :**

అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరపున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు.

వివరాలు 2లో



# ప్రజల సమస్యలు ఎజెండా చర్చించాలి

## కొత్త ఏడాదిలోకి అడుగిడుగుతున్న తరుణం

మనమంతా కలసికట్టుగా ముందుకు సాగాలి

రాజ్యాంగం ఆవిర్భవించి నేటికి 75 ఏళ్లు

సంవిధాన్ సదన్‌లో నేడు రాజ్యాంగ దినత్సవం

పార్లమెంట్ సమావేశాల నేపత్యంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,నవంబర్25తెలుగు వెలుగు :**

ప్రజలతో తిరస్కరణకు గురైన వారు పార్లమెంట్‌ను నియత్రించే పనిలో ఉన్నారని ప్రధాని మోడీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలపై చర్చకు అంతా సిద్దంగా ఉండాలని, ప్రభుత్వం అందుకు సంసిద్దంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు.

వివరాలు 2లో



సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు

## దగ్గరపడ్డాయ్

మహారాష్టలో తగిన బుద్ధి చెప్పారు

రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు

బీఆర్ఎస్ మీదే కేసులా... కాంగ్రెస్ మీద కేసులుండవా.?

మహబూబాబాద్ మహాధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు.



వివరాలు I 2లో



## ఈవీఎంలలో అవకతవకలు జరిగాయి

మహారాష్టలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి

శివసేన ఎంపీ సంజయ్ రౌత్

**న్యూఢిల్లీ,నవంబర్25తెలుగు వెలుగు :**

మహారాష్ట్ర ఎన్నికల వేళ ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. బ్యాలెట్ పేపర్లను వాడి మహారాష్ట్రలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని సంజయ్ రౌత్ సోమవారం డిమాండ్ చేశారు.

వివరాలు 2లో

సంభాల్ కాల్పుల పై అత్యంత

## దురదృష్టకరం

రాష్ట్ర ప్రభుత్వం వైఖరిపై స్పందించిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,నవంబర్25తెలుగు వెలుగు :**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంభాల్ కాల్పుల ఘటనపై సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. సంభాల్ కాల్పుల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత తొందరపాటు వైఖరి అత్యంత దురదృష్టకరమని అన్నారు.

వివరాలు 2లో



కాశ్మీర్‌కు 370ని ఆనాడే అంబేడ్కర్

## వ్యతిరేకించారు

కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

**న్యూఢిల్లీ,నవంబర్25తెలుగు వెలుగు :**

రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డా.బీఆర్ అంబేడ్కర్ జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడాన్ని వ్యతిరేకించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు అది విరుద్ధమని ఆయన భావించారని చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని అంబేడ్కర్ లేనప్పుడు రాజ్యాంగ పరిషత్తు హడావుడిగా ఆమోదించిందన్నారు.

వివరాలు 2లో



## 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి..?

అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించే ప్లాన్!

ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..?

అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలి

మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పై మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు స్పందించారు.స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే..

వివరాలు 12లో



తెలుగు జాతీయ దినపత్రిక
తెలంగాణ
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

# సంపాదకీయం

## వ్యవసాయంపై రైతులకు తగ్గుతున్న ఆసక్తి..

నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులపై కేంద్రం తాజాగా నివేదిక వెల్లడించింది. ధరల జాతీయ సగటు దాదాపు వంద శాతం నుంచి 200 శాతం వరకు పెరిగినట్లు 'వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సీపీఐ)', వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్-సీఎఫ్‌పీఐ) 2024 నివేదిక వెల్లడించింది. చాలా రాష్ట్రాల్లో సరైన సాగు పద్ధతులు లేకపోవడంతోపాటు పెట్టుబడి కూడా ఎక్కువ కావడంతో ధరల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో పల్లె జనాభాలో 70శాతానికిపైగా రైతు కుటుంబాలు ఉండేవి. ఆ కుటుంబా ల్లోనూ దాదాపుగా అందరూ వ్యవసాయంలో భాగస్వాములు అయ్యేవారు. కానీ, ఇప్పుడు పల్లెల్లో రైతులు 50శాతం కూడా లేరు. నిజానికి పల్లెల్లో వ్యవసాయం ఇప్పుడు ప్రధాన వృత్తి కాదు. రియల్ ఎస్టేట్, రిటైల్ షాపులు సహా బట్టల దుకాణాలు, చికెన్ షాపులు ఇలా ఎన్నో ఉప వృత్తుల వైపు రైతు కుటుంబాలు దృష్టి సారిస్తున్నాయి. ఫలితంగా వ్యవసాయం, అంతరపంటలపై ఎవరికీ పెద్దగా ఆసక్తి ఉండటం లేదు. గతంలో ప్రతి ఇంటికీ కూరగాయల పాదులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవులు, బర్రెల పెంపకం ఉండేది. కానీ, ఇప్పుడు వాటి పెంపకం రైతు కుటుంబాల జీవనశైలికి ఆటంకంగా మారింది. ఏదైనా పెళ్లి పేరంటానికి వేరే ఊరికి వెళ్లాల్సి వస్తే కోళ్లు, మేకలు, గేదెల కోసం ఎవరో ఒకరు తప్పక ఉండాల్సి వస్తుంది. అందుకు చాలామంది సిద్ధంగా లేకపోవడంతో వాటి పెంపకమే తగ్గిపోయింది. పల్లెల్లోకి కూడా ప్యాకెట్ పాలు వస్తుండటంతో ఆవులు, బర్రెలను పెంచాల్సిన అవసరం ఏమున్నది? అనే ప్రశ్నలు వస్తున్నాయి. గతంలో అంతరపంటలు సహా ప్రధాన పంటలకు విత్తనాలు సొంతంగా అభివృద్ధి చేసుకునేవారు. ఇప్పుడు కంపెనీలే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుండటం.. అంతరపంటల విత్తనాలు నాసిరకంగా ఉంటుండటంతో చాలామంది రైతులు శ్రద్ధ చూపడంలేదు. ఫలితంగా గ్రామాల్లో ఆదాయం చాలా తగ్గిపోయింది. ఒకప్పుడు బోడకాకరకాయ పల్లెల్లో పెంటలపై మొలిచేది. వాటిని చాలామంది తినేవారు కూడా కాదు. కానీ, ఇప్పుడు పట్టణాల్లో దాని ధర కిలో 200పైమాటే. పూర్వం రైతులు వరి, పెసర, కంది సజ్జలు, నువ్వులు, ఉలవలు, రాగులు, మినుములు పజ్జొన్నలు, ఎర్ర జొన్నలు, తెల్ల జొన్నలు, మక్కజొన్న, బుడ్డ శనగలు, అలసంద, గోధుమ తదితర పంటలు సాగు చేసేవారు. ఈ సంప్రదాయ వ్యవసాయం వల్ల పల్లెల్లో గ్రామీణ స్వయం పోషక విధానం ఉండేది. కానీ.. ఇప్పుడు చిరుధాన్యాలు, ఆరుతడి పంటల సాగు తగ్గిపోయింది. దీంతో మనం చిరుధాన్యాలు, పప్పు దినుసులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయి. ఫలితంగా ధరలు పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతుండగా.. సామాన్యుడు బతకలేని పరిస్థితికి వచ్చింది. వ్యవసాయం చేయడం దండుగ అని ఇప్పటికే చాలామంది రైతులు అభిప్రాయపడుతున్నారు. తమ పిల్లలను మాత్రం ఈ రొంపిలోకి దింపొద్దని బలంగా అనుకుంటున్నారు. చాలామందిలో ఈ అభిప్రాయం ఉండటంతో అసలు వచ్చే కొన్నేళ్లలో వ్యవసాయంలోకి కొత్త తరం వస్తుందా? అనే భయాలు నెలకొన్నాయి. గతంలో ప్రతి రైతు తమకు ఉన్న నైపుణ్యాలతో సాగు మెళకువలు పెంచుకుంటూ కొత్త ప్రయోగాలు చేస్తూ దిగుబడి పెంచుకునేవారు. రకరకాల ఉపయోగకరమైన చిరుధాన్యాలు సహా పప్పు దినుసులు సాగు చేసేవారు. కానీ, ఇప్పుడు పల్లెల్లో ప్రధానంగా వరి.. తర్వాత మొక్కజొన్న, పత్తి తప్ప మిగతా పంటలపై దృష్టి పెట్టడంలేదు. వరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తుండటంతో పంటకు మినిమం గ్యారంటీ అన్న కోణంలో రైతులు ఆలోచిస్తున్నారు. కానీ, చిరుధాన్యాలు, పప్పుదినుసులు పండిస్తే అంతకుమించి లాభం వస్తుందని రైతులకు తెలిసినా.. ధైర్యం చేయలేకపోతున్నారు. అకాల వర్షాలకు ఇతర పంటలు నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వదని.. దిగుబడి అనుకున్నంత రాకపోతే ఎలా అన్న భయాలు వారిని కొత్త పంటల దిశగా ఆలోచించనీయడంలేదు. ప్రభుత్వాలు, ముఖ్యంగా వ్యవసాయ అధికారులు చొరవ తీసుకుని రైతులకు తగిన సలహాలు ఇస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. మరోవైపు, పిల్లల చదవుల కోసం చాలా మంది యువ రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు. పల్లెల్లోని మౌలిక వసతుల లేమి వల్ల పట్టణాలు నగరాలకు వలసపోతున్నారు. వాచ్‌మన్ ఉద్యోగాలు, లేబర్ పనులు కూడా చేయడానికి వెనుకాడటం లేదు. చాలా రైతు కుటుంబాలు వ్యవసాయం నుంచి తప్పుకుంటుండటంతో రాబోయే రోజుల్లో కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయంలోకి అడుగుపెడతాయి. రైతులనుంచి భూమి లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తాయి. పూర్తి యాంత్రీకరణతో ఆహార ఉత్పత్తులపై పూర్తి ఆజమాయిషీ సాధిస్తాయి. అప్పుడు కిలో రూ. 1000 అయినా ఆశ్చర్యం ఉండదు. పైగా కార్పొరేట్ కంపెనీలు అగ్రదేశాలకు ఎగుమతి చేయడానికే ఎక్కువ ఆసక్తి చూపుతాయి.. కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయంపై ఆజమాయిషీ సాధిస్తే దేశంలో ఆహార లభ్యత సహా ఆహారపుటలవాట్లు కూడా వారే నిర్దేశిరచే పరిస్థితి వస్తుంది. దేశంలో సగటున వ్యక్తి ఆదాయం 12 ఏళ్లలో రెట్టింపైనా.. జీవన ప్రమాణాల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. సామాన్యుల రోజువారీ జీవనానికి కావాల్సిన నిత్యావసర వస్తువుల నుంచి వైద్యం వరకూ ఖర్చులు అంతే స్థాయిలో పెరిగాయి. 'వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సీపీఐ)', వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్-సీఎఫ్‌పీఐ) 2024 ఆగస్టు నివేదికను ఎన్ఎస్ఎస్ఓ సంస్థకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది తయారు చేశారు. వీరు దేశవ్యాప్తంగా 1,114 పట్టణాల్లోని మార్కెట్లు, 1,181 గ్రామాల నుంచి సేకరించిన ధరల వివరాలతో సిద్ధం చేశారు. దాని ప్రకారం ఈ ఆగస్టు నివేదికను విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా కీలకమైన నిత్యావసర సరుకుల ధరల్లో వ్యత్యాసం, సరుకుల వారీగా, రాష్ట్రాల వారీగా పేర్కొంది. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై దృష్టి సారించి..వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహిచేందుకు తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

# ప్రజల సమస్యలు ఎజెండా చర్చించాలి

మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు. ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం అని అన్నారు. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని ప్రధాని అన్నారు. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం అని మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు.. కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ బాధించే విషయం ఏంటంటే.. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నానని మోదీ అన్నారు. దేశం 2025ని పూర్తి ఉత్సాహంతో, ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్లమెంటు సమావేశాలు అనేక విధాలుగా ప్రత్యేకమైనవి. ఇప్పుడు అతిపెద్ద విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం, 75వ సంవత్సరంలోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి మంచి అవకాశమని గుర్తు చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు. మహారాష్ట్ర, యూపీలో బంపర్ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి పార్లమెంట్ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. శీతాకాల సమావేశాలు కావడంతో వాతావరణం చల్లగా ఉంటుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కొద్దిమంది వ్యక్తులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రస్తావించారు. ఆ వ్యక్తులు తమ బాధ్యతలను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ గూండాయిజంతో పార్లమెంట్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని ప్రధాని మోదీ అన్నారు. వారు పార్లమెంటులో చర్చకు అనుమతించరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆపడమే వారి సొంత లక్ష్యమని ఎద్దేవా చేశారు ప్రధాని మోదీ. కానీ దేశ ప్రజలు వారి ప్రవర్తనను పట్టించుకోరని, సమయం వచ్చినప్పుడు ప్రజలు వారిని శిక్షిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని సూచించారు. సాంప్రదాయం ప్రకారం సమావేశాల మొదటి రోజు, ప్రధాని మోదీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రసంగించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు, లోక్‌సభ, రాజ్యసభల 19-9 సమావేశాలు జరుగుతాయి. వక్ఫ్ (సవరణ) బిల్లుతో సహా 16 బిల్లుల జాబితాను ప్రభుత్వం సెషన్‌లో పరిశీలనకు సిద్ధం చేసింది. లోక్‌సభలో ఎనిమిది, రాజ్యసభలో రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం పలు ముఖ్యమైన బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు ప్రయత్నిస్తుంది. గత సెషన్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్యాంకింగ్ నిబంధనల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు ఇందులో ఉన్నాయి. కానీ వాటిని పాస్ చేయలేకపోయారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందిన ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అనేక ముఖ్యమైన బిల్లులపై కాంగ్రెస్‌తో సహా పలు ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు గందరగోళంగా మారే ఛాన్స్ ఉంది.

## సీఎం రేసులో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే

మొదటి పేజీ తరువాయి

దీంతో ఎవరు సీఎం అవుతారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. మహా తదుపరి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్‌కే అజిత్ పవార్ మద్దతు తెలిపినట్లు తెలిసింది. ఆదివారం జరిగిన సమావేశంలో దేవేంద్ర ఫడ్నవీస్‌ను సీఎం చేసేందుకు అజిత్ పవార్‌తో పాటు ఆయన ఎమ్మెల్యేలంతా మద్దతు పలికినట్లు సమాచారం. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో 288 సీట్లకు మహాయుతి కూటమి 235 సీట్లు నెగ్గి విజయాన్ని కైవసం చేసుకుంది. అందులో బీజేపీ 132 సీట్లతో ప్రధాన పార్టీగా ఆవిర్భవించింది. అయితే అధికారం చేపట్టడానికి 145 మ్యాజిక్ ఫిగర్ కాగా, బీజేపీ దానికి ఎంతో దూరంలో లేదు. ఈ నేపథ్యంలో బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీసే ముఖ్యమంత్రి అవుతారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే సీఎంగా షిండేనే కొనసాగించాలని బీజేపీలోని కొందరు నేతలు సూచిస్తున్నారు. ఈ సస్పెన్స్‌కు 24 గంటల్లో తెరపడే అవకాశం ఉంది. మరోవైపు మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ వర్గాలు తెలియజేశాయి. మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం సోమవారం ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయని శివసేనకు చెందిన మంత్రి దీపక్ కేసర్కర్ తెలిపారు. తొలి విడుతలో ముఖ్యమంత్రితో పాటు 21 మంది మంత్రులతో ప్రభుత్వం కొలువుదీరనున్నదని విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యమంత్రితో పాటు వీరు ప్రమాణం స్వీకారం చేయనున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి మినహా మరో 43 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించవచ్చు. ఇందులో బీజేపీ నుంచి 21, శివసేన (షిండే) పార్టీ నుంచి 12, ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీ నుంచి 10 మందికి మంత్రులుగా అవకాశం లభించవచ్చని తెలుస్తున్నది.

## ఈవీఎంలలో అవకతవకలు జరిగాయి

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి 288 స్థానాలకు గాను 230 స్థానాలను గెలుచుకున్న విషయం తెలిసిందే. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడీ 46 స్థానాలను గెలుచుకుంది. శివసేన (యూబీటీ) 95 సీట్లలో పోటీ చేయగా కేవలం 20 మాత్రమే గెలుచుకుంది. దీనిపై ముంబైలో సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. ఈవీఎంలకు సంబంధించి తమకు దాదాపు 450 ఫిర్యాదులు అందాయని తెలిపారు. పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఈ అంశాలపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఈ ఎన్నికలు న్యాయబద్ధంగా జరిగాయని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. అందుకే ఫలితాలను పక్కనబెట్టి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. కొందరు మహాయుతి అభ్యర్థులు భారీ తేడాతో విజయం సాధించడంపై సంజయ్ రౌత్ అనుమానాలు వ్యక్తం చేశారు. వారు చేసిన విప్లవాత్మక పనులు ఏమున్నాయని, అంత భారీ మెజార్టీతో వారు ఎలా గెలుస్తారని సంజయ్ రౌత్ అన్నారు. ఇటీవల పార్టీలు మారిన నేతలు కూడా ఎమ్మెల్యేలుగా గెలిచారని చెప్పారు. ఇది అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుడు తొలిసారిగా ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేశారని, దీనిని విస్మరించలేమని అన్నారు.

## సంభాల్ కాల్పుల పై అత్యంత దురదృష్టకరం

మొదటి పేజీ తరువాయి

హింస మరియు కాల్పుల్లో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి అని రాహుల్ అన్నారు. "అన్ని పార్టీల మాట వినకుండా పరిపాలన యొక్క అసంబద్ధమైన చర్య పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ ఘటనచాలా మంది మరణానికి దారితీసింది. దీనికి బిజెపి ప్రభుత్వమే ప్రత్యక్ష బాధ్యత వహిస్తుంది" అని రాహుల్ గాంధీ అన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కాంగ్రెస్ నేత కోరారు. హిందూ-ముస్లిం వర్గాల మధ్య చీలికలు, వివక్ష సృష్టించేందుకు బీజేపీ అధికారాన్ని వినియోగించుకోవడం రాష్ట్రానికి గానీ, దేశానికి గానీ ప్రయోజనం కలిగించదని, వీలైనంత త్వరగా ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థిస్తున్నాను. "శాంతి మరియు పరస్పర సామరస్యాన్ని కాపాడుకోవడమే నా విజ్ఞప్తి. భారతదేశం ఐక్యత మరియు రాజ్యాంగం యొక్క మార్గంలో ముందుకు సాగేలా చూసేందుకు మనమందరం కలిసి చేరాలి, మతతత్వం మరియు ద్వేషం కాదు " అన్నారాయన. ఆదివారం సంభాల్‌లో జామా మసీదు సర్వేను వ్యతిరేకిస్తున్న ఆందోళనకారులు భద్రతా బలగాలతో ఘర్షణకు దిగిన హింసాత్మక ఘర్షణల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ సంఘటనలో నలుగురు మృతి చెందారు మరియు 20 మంది పోలీసు సిబ్బందితో సహా అనేక మంది గాయపడ్డారు, నిరసనకారులు వాహనాలను తగులబెట్టారు మరియు పోలీసులపై రాళ్ళు విసిరారు. వారు టియర్ గ్యాస్ మరియు లాఠీ ఛార్జీలతో ప్రతిస్పందించారు. మసీదు గతంలో దేవాలయంగా ఉందని ఆరోపిస్తూ సీనియర్ న్యాయవాది విష్ణు శంకర్ జైన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వే ప్రారంభమైంది.

## స్కిల్ వర్సిటీ విరాళం 100 కోట్లు వెనక్కి

మొదటి పేజీ తరువాయి

అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగ వద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతు న్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి.. రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు. అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి.. బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా.. ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అదానీ సంస్థపై లంచాల విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై విధంగా స్పందించారు. అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌నకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు' అని సీఎం అన్నారు.

## భాగస్వామ్య పార్టీలు కలిసి నిర్ణయం తీసుకుంటా

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో ముఖ్యమంత్రి అంశంపై అజిత్ పవార్ స్పందించారు. భాగస్వామ్య పార్టీలు కలిసి ముఖ్యమంత్రి పదవిపై నిర్ణయం తీసుకుంటాయని అజిత్ పవార్ వెల్లడించారు. తాము ముగ్గురం కూర్చొని ముఖ్యమంత్రి పదవిపై తుది నిర్ణయానికి వస్తామన్నారు. అసెంబ్లీలో ఎన్సీపీ నేతగా తనను తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారని తెలిపారు. శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే, బీజేపీ నుంచి ఫడ్నవీస్ ఎన్నికైనట్లు తెలిపారు. మహారాష్ట్ర శాసన సభ గడువు మంగళవారంతో ముగియనుంది. గెలిచిన కూటమి ఆ తర్వాత 24 గంటల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. లేదంటే రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుంది. మరోవైపు సీఎం రేసులో ఏక్‌నాథ్ షిండే ఉన్నారని ఆ పార్టీ నేత సంజయ్ షిర్‌సత్ తెలిపారు. సీఎం ఎవరనేది అంతిమంగా ఢిల్లీలో నిర్ణయిస్తారని, చర్చలు జరుగుతున్నందున ఫలితం ఏమిటనేది వేచిచూడాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున దానిని కూడా సీఎం ఎంపిక విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మంగళవారానికి ఒక స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

## కాశ్మీర్‌కు 370ని ఆనాడే అంబేడ్కర్ వ్యతిరేకించారు

మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం' పేరుతో దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ఈ విధంగా మాట్లాడారు. రాజ్యాంగ పరిషత్తు ముందుకు వచ్చిన అన్ని అంశాలపై తొలుత మాట్లాడింది అంబేడ్కర్. నిత్యం అనేక గంటలపాటు లేదా ఒక్కోసారి రోజు మొత్తం దీనిపై చర్చలు జరిగేవి. ఈ చర్చలకు అంబేడ్కర్ సమాధానాలు ఇచ్చేవారు. డిబేట్లలో ఆయనే ఎక్కువగా మాట్లాడినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ, ఆర్టికల్ 370ని మాత్రం ఆయన వ్యతిరేకించారని అర్జున్ రామ్ మేఘ్‌వాల్ పేర్కొన్నారు. అయితే, దీనిని ఆమోదించాలని జవహర్‌లాల్ నెహ్రూ పట్టుబట్టారని, ముసాయిదా కమిటీలోని మరో సభ్యుడికి దీని ఆమోదం బాధ్యత అప్పగించారని అన్నారు. ఆమోదం తెలిపే సమయంలో అంబేడ్కర్ అక్కడ లేరని, ఆసుపత్రికి వెళ్లారని అన్నారు. బీఆర్ అంబేడ్కర్ నిజమైన దేశభక్తుడని కేంద్ర మంత్రి కొనియాడారు.

# ఉమ్మడి పది జిల్లాల బీసీలతో ఉద్యమించిన బీసీ గర్జన సభలో పాల్గొన్న

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్.**

(తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి )

హైదరాబాద్, రవీంద్రభారతిలో 75 కోట్ల బీసీ ప్రజానీకానికి సమన్వయ న్యాయం చేకూర్చడం కోసం ఉద్యమించిన బీసీ గర్జన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహా ఉద్యమ బీసీ గర్జన సభకు హాజరైన ప్రముఖ ప్రముఖ మేధా వర్గ నాయకులతోపాటు పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ చరిత్రలో పదివేల ఉద్యమాలకు పైగా ఉద్యమాలు చేసిన ఘనత జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య గారిదని కొనియాడుతూ ప్రజాస్వామ్యంలో కుల జనగణన లెక్కలతో చూసుకుంటే బీసీ వర్గాలకు అన్యాయం జరుగుతుందని ప్రతి బీసీ బిడ్డ తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల నుండి భారీ ఎత్తున తరలివచ్చి బీసీ గర్జన సభను విజయవంతం చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు, అదేవిధంగా బీసీలను ఇకముందు ఏమాత్రం చిన్నచూపు చూసినా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బీసీవై పార్టీ ఇన్చార్జిగా, కాంటెస్టెంట్ ఎమ్మెల్యే, ఎంపీగా అణగారిన వర్గాల వారికి సంపూర్ణ న్యాయం చేకూర్చుటకు ఎప్పుడు నడుం బిగించి పోరాటానికి సిద్ధమేనని న్యాయం చేకూరే వరకు అలపెరుగని ఉద్యమాలు చేస్తామని ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటామని అదేవిధంగా అవినీతికి పాల్పడుతున్నటువంటి ప్రభుత్వ అధికారులలో ప్రక్షాళన కొనసాగిస్తామని, తెలంగాణ రాష్ట్ర



ప్రభుత్వం యొక్క అభివృద్ధికి సంపూర్ణంగా మద్దతుగా ఉంటూ తెలంగాణ అభివృద్ధిని సాధిస్తామని తెలియజేశారు. ఈ యొక్క బీసీ మహా గర్జన సభలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ సత్యం, నందగోపాల్, నీలం వెంకటేష్ ,రామకృష్ణ,లాల్ కృష్ణ, ఉదయ్ కుమార్, రాజ్ కుమార్, పృథ్వీ గౌడ్, స్వామి వివేక్ పాటిల్, బీసీ ఆజాద్ ఆర్మీ నాయకులు జగదీష్ యాదవ్, మెదక్ పార్లమెంట్ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా కాంటెస్ట్ ఎంపీ జి సాయి గౌడ్, సంగారెడ్డి జిల్లా బీసీ నాయకులు ప్రభు గౌడ్, ఎండి జావీద్, గొల్లగూడెం శంకర్ గౌడ్, హైదరాబాద్ మహిళా సంఘాల నాయకురాలు శివమ్మ ,మరియు అధిక సంఖ్యలో బిసి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# రాయికల్ మండల ఎమ్మార్పీఎస్ పూర్తి స్థాయి కమిటీ ఎన్నిక

తెలుగు వెలుగు ప్రతినిధి రాయికల్ రూరల్ నవంబర్ 25



రాయికల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీస్ మండల నిర్మాణ కమిటీ ఇన్చార్జి పోదేటీ సునీల్ మాదిగ ఆధ్వర్యంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు దుమల గంగారాం, మాదిగ ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్ మాదిగ హాజరై మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలో జరిగినటువంటి ఉమ్మడిగా జిల్లా సమీక్ష సమావేశంలో తీసుకున్నటువంటి నిర్ణయంలో భాగంగా,నూతన మండల కమిటీ ఏర్పాటు చేసి, రానున్న రోజుల్లో ఎమ్మార్పీఎస్ ని బలోపేతం చేసి,మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికి రాయికల్ మండల అధ్యక్షులుగా దొబ్బల వేణు గోపాల్,అధికార ప్రతినిధిగా పాలెపు సురేష్, ఉపాధ్యక్షులుగా నక్క భీమేశ్, ప్రధాన కార్యదర్శిగా బెక్కం వెంకటేష్,ప్రచార కార్యదర్శులుగా కండ్లపల్లి నరేష్,మారంపల్లి గంగారెడ్డి మండల కమిటీ ఏర్పాటు చేశారు.

# అభివృద్ధి పనులకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

(సంగారెడ్డి జిల్లా తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు హాజరుకావాలని కోరుతూ మంత్రులు దామోదర రాజరసింహ, (సీతక్క) అనసూయ గార్ల లెటర్ పాడ్ ను పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. %వీ+చీ=జు+ూ, జ==% కింద 2750 కోట్ల నిధులతో బడ్జెట్ అంచనాలు తయారు చేసినట్లు అధికారులు చెప్పారు. నియోజకవర్గంలో సిసి రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు , అంగన్వాడి భవనాల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. మార్చి 2025 నాటికీ పనులు పూర్తి అవుతాయాని తెలిపారు. కార్యక్రమంలో జగదీశ్వర్ %ూజు్రా=% మెదక్, దీపక్ కుమార్ %ణజు్రా=% సంగారెడ్డి, అరవింద్ %ూజు ంజుశ్రీ% సంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కసాల బుచ్చిరెడ్డి, %ూజు% కొండాపూర్, శ్రీనాథ్ రెడ్డి, %ూజుజు% కంది, ఆఫ్రోజ్ %ూజుజు% సంగారెడ్డి తదుతరులు పాల్గొన్నారు.



# పేదలకు ఈ ఐదు పథకాలు ఉచితంగా ఇవ్వండి చాలు

**- ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్**

(తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి )

వరంగల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా కమిటీ... ధర్నా అనంతరం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్ లో కలెక్టర్ సత్య శారదా దేవి గారికి వినతి పత్రం సమర్పించిన అనంతరం వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కేదల ప్రసాద్ గారు మాట్లాడుతూ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పేదలందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, ఒక ఎకరం సాగు భూమి, నాలుగు గదుల పక్కా ఇల్లు అంద చేయాలని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాలను ముట్టడి చేసి, కార్యాలయాల ముందు ధర్నా చేయడం జరిగిందని అన్నారు... ఒక వేళ కాంగ్రెస్ ప్రభుత్వం పై అయిదు పథకాలను అమలు చేయకపోతే ముందు ఆమరణ దీక్షలకు పూనుకుంటామని ప్రసాద్ హెచ్చరించారు. ఈ ధర్నాకు ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేకల సుమన్ గారు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో వందల సంక్షేమ పథకాలు అమలు చేసే బదులు అర్హులైన పేదలకు పై ఐదు పథకాలు ఉచితంగా అందచేస్తే రాష్ట్ర%శీ% సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మేకల సుమన్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ కేదల ప్రసాద్ పటేల్ తో పాటు డిఎస్పీ వర్ధన్న పేట మండల కన్వీనర్ రొడ్డా మురళీ కృష్ణ, నర్సంపేట మండల కన్వీనర్ సంగాల శివ కృష్ణ, గీసుకొండ మండల కన్వీనర్ సిలువేరు రవి, చిన్నారావు పేట మండల కన్వీనర్ అలువాల శ్రీనివాస్, ధర్మ టీచర్స్ యూనియన్ జిల్లా ఇన్చార్జి రాగూర్ మహారాజ్, మంతెన బాబు రావు, బరిగెల సురేష్, మాదాసి ప్రవీణ్, డి ఎస్పీ యువజన నాయకుడు రణధీర్, దీక్షిత్ తదితరులు ఉన్నారు.



# జానకమ్మ రఘునాథ స్వామి వార్ల ఊరేగింపు.

**ఆలయ కమిటీ పెద్దలు కులకర్ణి నరసింహారావు.**

**సోమవారం నుండి గుండం జాతర ఉత్సవాలు.**

( సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి సదాశివపేట )

సదాశివపేట పట్టణంలోని మాతృశ్రీ జానకమ్మ రఘునాథ స్వామి ఆలయం గుండం జాతర నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దైవ కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ పెద్దలు కులకర్ణి నరసింహారావు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. సోమవారం నాడు మాతృశ్రీ జానకమ్మ రఘునాథ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు నరసింహారావు కులకర్ణి గృహం నుండి మొదలై గాంధీ చౌక్ మీదుగా సిద్ధాపూర్ గౌని గుండా గుండంబావి వరకు విగ్రహాలను ఊరేగింపుగా కోలాటాలతో భజన భక్తబృంద వారిచే భజనలు నిర్వహించుకుంటూ విగ్రహాలను తీసుకెళ్లారు.లఘున్యాసక పూర్వక రుద్రాభిషేకం 11 గంటలకు అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ 9 గంటల నుండి తెల్లవారులు సదాశివపేట భజన భక్త బృందం వారిచే కార్యక్రమాలు నిర్వహించారు.



# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథయాత్రకు కరెంటు తీగల ఎత్తు పెంచడం కొరకై విద్యుత్ శాఖ వారికి విన్నపం.

కొడిమ్యాల:నవంబర్ 25(తెలుగు వెలుగు).

కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవం డిసెంబర్ 4,5,6 లో భాగంగా డిసెంబర్ 6వ తేదీ రోజున రథయాత్ర (ఊరేగింపు) కొరకై కొడిమ్యాల విద్యుత్ శాఖ అధికారులు ఎడి మహేందర్,ఎఇ రఘునాథ్,సబ్ ఇంజనీర్ మధుకర్ రెడ్డి సబ్ స్టేషన్ నందు ఆలయ నిర్మాణ కమిటీ తరపున మెయిన్ రోడ్డు పై ఎలక్ట్రిక్ తీగల ఎత్తు పెంచుట కొరకై వారికి సంప్రదించి వినతి పత్రం అందజేయడమైనది.ఇట్టి కార్యక్రమానికి విద్యుత్ శాఖ వారు సానుకూలంగా స్పందించి. రథయాత్రకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలియజేసినారు.ఇట్టి కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ,అర్చకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ మొదటి అంతస్తులోని సిపిఓ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

**సిపివో కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

**షార్ట్ సర్క్యూట్ పై విచారణకు ట్రాన్సుకో,అగ్నిమాపక శాఖలను ఆదేశించిన కలెక్టర్.**

సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి

కలెక్టరేట్ లోని అన్ని శాఖల కార్యాలయాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను తనిఖీ చేయాలని ఆదేశం. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో ఉన్న సిపిఓ కార్యాలయంలో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఘటనకు సంబందించిన వివరాలు సంబంధిత శాఖ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన వివరాల ప్రకారం, షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు వివరించారు.పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ట్రాన్సుకో,అగ్నిమాపక శాఖ లను ఆదేశించారు.ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సేకరించి, షార్ట్ సర్క్యూట్ వెనుక ఉన్న కారణాలను ఖచ్చితంగా నిర్ధారించాలని ట్రాన్స్కో, అగ్నిమాపక శాఖ కు సూచించారు. కలెక్టరేట్ లోని అన్ని కార్యాలయాల భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల కార్యాలయాల్లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనేది పరిశీలించాలని ఇలాంటి సంఘటనలు కలెక్టరేట్లో పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.





# వివాహ వేడుకల్లో పాల్గొన్నా శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ళ సంజీవరెడ్డి

తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి కంగ్టి నవంబర్ 25

నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని గాజుల్ పాడ్ గ్రామ పరిధిలోని టోపాతాండకు చెందిన రామ్లానాయక్ కుమారుని వివాహనికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ళ సంజీవరెడ్డి మరియు వారితో పాటు పండరి రెడ్డి, సిద్దా రెడ్డి మాజీ ఎంపీటీసీలు,మస్తాన్, రామారావు మాజీ ఎంపీపీ, తాజా మాజీ సర్పంచ్ పల్లవి పరుశురాం, రాథోడ్ నాందేవ్, రాంకిషన్, ధూమ్ సింగ్,రవీందర్ డీలర్ చందర్, జాదవ్ రవీందర్. జాదవ్ రమేష్,పవన్,గోపాల్ నాయక్, హరిసింగ్,తదితరులు పాల్గొన్నారు



# కలెక్టరేట్ లో కార్తీక వనభోజనాలు.

**ముఖ్య అతిధులుగా హాజరైన కలెక్టర్ ,అదనపు కలెక్టర్**

సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి

సంగారెడ్డి కలెక్టర్ లోని ఫ్రీడమ్ పార్కులో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. డిఆర్డిఏ పిడి జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్ లు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి కార్తీక వనభోజనాలలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పాల్గొని భోజనం చేశారు. ఉద్యోగులలో స్నేహభావం పెంపొందడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# యాదవ సంఘం అడహాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గనవేని మల్లేష్ యాదవ్

తెలుగు వెలుగు ప్రతినిధి రాయికల్ రూరల్ నవంబర్ 25

యాదవ సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని రాయికల్ పట్టణంలోని గుడేటి రెడ్డి ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించి,యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగాగనవేని మల్లేష్ యాదవ్ ను, అడహాక్ కమిటీ జిల్లా సలహా దారులుగా తొట్ల చిన్నయ్య యాదవ్, రెబ్బాస్ మల్లయ్య యాదవ్,కొలుముల రమణ యాదవ్,బల్కం మల్లేష్ యాదవ్, దండవేణి మల్లయ్య యాదవ్,ముక్కెర శేఖర్ యాదవ్,జిల్లా కార్యవర్గ సభ్యులుగా మాధం వినోద్ యాదవ్,అంకం శంకర్ యాదవ్, కొక్కెర శేఖర్ యాదవ్,చిర్రం ప్రకాష్ యాదవ్ రాయికల్ టౌన్ ఇన్చార్జిగా ఆసరి మల్లేష్ యాదవ్, గంగవేణి కొమురయ్య యాదవ్, రాయికల్ మండల ఇన్చార్జిగా గంగుల తిరుపతి యాదవ్,గంగుల శ్రీనివాస్ యాదవ్ లను ఎన్నుకున్నారు. ఈ కమిటీ సభ్యులు మిగతా యాదవులను కలుపుకుని సంఘ బలోపేతం,సభ్యత్వం గురించి తెలియచేసి జిల్లాలోని అన్ని గ్రామాలలో అందరికి తెలియచేసి సభ్యత్వం చేయించాలని నిర్ణయించారు.సభత్వ రుసుము 200 రూపాయలుగా నిర్ణయించారు.తొందరగా సభ్యత్వాలు పూర్తి చేసి సభ్యత్వం తీసుకున్న సభ్యుల ఓటింగ్ ద్వార జిల్లా మండల కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.మొదటి సభ్యత్వాలను అలిశెట్టి భుచ్చి రాములు, తొట్ల చిన్నయ్య యాదవులకు అందించి సభ్యత్వాల డ్రైవ్ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలలో నుండి యాదవులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ

**సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి సదాశివపేట :**

బత్తుల అనిల్ కుమార్ గారి 18వ మహా పడిపూజ ది సదాశివపేట లోని అయ్యప్ప దేవాలయంలో గురుస్వాములు శ్రీ సుధాకర్ గౌడ్, గోని శంకర్, నరేష్, విశ్వనాథం గురుస్వాముల ఆధ్వర్యంలో 18వ పడిపూజ ఘనంగా నిర్వహించారు,గణపతి పూజ, అయ్యప్ప అభిషేకం, 18 మెట్ల పూజను నిర్వహించారు సుమారు 1000 మంది భక్తులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో గురు స్వాములు చింతా గోపాల్, వీరి కుమార్, దాకుర్ అశోక్ గౌడ్, మతం బిక్షపతి, వీరు కుమారు పాల్గొన్నారు,డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మున్సిపల్ చైర్మన్ అపర్ణ శివరాజ్ పాటిల్, టిఆర్ఎస్ యువ నాయకుడు చింత సాయినాథ్, అందోల్ నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అడికే జగదీశ్వర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అనిమిశెట్టి మల్లేష్, సదాశివాపేట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గదిగా రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు అనిమిశెట్టి జయప్రకాష్, కార్యదర్శి వినోద్ కుమార్,రాజు, అరుణ, శ్రీకాంత్, చల్మెడ బసవరాజ్, శంకర్ జిల్లా యువజన అధ్యక్షులు మల్లికార్జున్, నవీన్ రామోజీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ ప్రధాన కార్యదర్శి శారద, అనిమిశెట్టి అన్నపూర్ణ, జిల్లా ఎమ్మార్వో శివప్రసాద్, సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు



# సంగారెడ్డి వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

## మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ మాట్లాడుతూ

**(సంగారెడ్డి జిల్లా తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా లోని కంది మండల కేంద్రంలోని శ్రీ పాండురంగ స్వామి జాతరలో వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్.సంగారెడ్డి జిల్లా కంది మండలం కంది గ్రామంలో శ్రీ పాండురంగ స్వామి జాతరలో భాగంగా సంగారెడ్డి వెల్నెస్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాంప్ నిర్వహించాడం జరిగింది ఈ యొక్క క్యాంప్ లో సుమారు 200 మంది పైగా పాల్గొని వివిధ రోగులకు ఈసీజీ , షుగర్ , బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించిడం జరిగింది ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది వెల్నెస్ హాస్పిటల్ అన్ని సౌకర్యాలతో కలిగి ఉంది ప్రతి పేదవాడు వైద్యం చేయుచుకునే విదంగా ఉంటుంది రోగులకు ఎక్కువ సమస్యలు ఉన్నవారికి సంగారెడ్డి లోని మా హాస్పిటల్ కి రెఫెర్ చేసి కావాల్సిన ట్రీట్మెంట్ అధిస్తాము... కార్యక్రమంలో డా హరిత, వెల్నెస్ హాస్పిటల్ మర్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ , మరియు హాస్పిటల్ సిబ్బంది మార్కెటింగ్ ఎస్క్యూటివ్ ధర్మ నాయక్ , ఆశ , కార్తీక్ దాస్ , అభ , తదితరులు పాల్గొన్నారు






# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన

## మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి నారాయణఖేడ్ నవంబర్ 25**

నారాయణఖేడ్ మండలం సంజీవన్ రావుపేట్ గ్రామానికి చెందిన సాబా బేగం గారి ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 23,500 రూపాయలు మరియు సిర్గాపూర్ మండలం బొక్కస్ గామ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గారి ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 25,500 రూపాయల చెక్కును లబ్ధిదారులకు అందజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల తాజా మాజీ జెడ్పిటిసి రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, తాజా మాజీ ఎంపీటీసీ భూపాల్, అజా మాజీ సర్పంచ్ విజయ్, గ్రామ పార్టీ అధ్యక్షులు పోచయ్య, శ్రీధర్ పటేల్, నాయకులు సత్యం, గణపతి, దస్తగిరి తదితరులు ఉన్నారు.






# కలెక్టరేట్ మొదటి అంతస్తులోని సిపిఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం.

## సిపివో కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు.

## అగ్ని ప్రమాదంపై విచారణకు పోలీసులను ఆదేశించిన కలెక్టర్.

**సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి**

లికలెక్టరేట్ లోని అన్ని శాఖల కార్యాలయాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను తనిఖీ చేయాలని ఆదేశం. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో ఉన్న సిపిఓ కార్యాలయంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అగ్ని ప్రమాదం జరిగిన సిపిఓ కార్యాలయాన్ని సోమవారం పరిశీలించారు. అగ్ని ప్రమాదం వివరాలను సంబంధిత శాఖ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు.అధికారులు చెప్పిన వివరాల ప్రకారం, షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు వివరించారు.అయితే, ప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు.జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ, ఈ అగ్ని ప్రమాదం ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ట్రాన్స్కో, అగ్నిమాపక శాఖ ను ఆదేశించారు.ఘటనలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సేకరించి, ప్రమాదం వెనుక ఉన్న కారణాలను ఖచ్చితంగా నిర్ధారించాలని అగ్నిమాపక శాఖ కు సూచించారు.ఈ అగ్ని ప్రమాదం తర్వాత, కలెక్టర్ క్రాంతి వల్లూరు కలెక్టరేట్ లోని అన్ని కార్యాలయాల భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల కార్యాలయాల్లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనేది పరిశీలించాలని ఇలాంటి సంఘటనలు కలెక్టరేట్లో పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



# ముదిరాజ్ నూతన భవన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న

## రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు

**( సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి సదాశివపేట)**

ఇస్మాల్ ఖాన్ పేట గ్రామంలోని ముదిరాజ్ సంఘం కందిగోని పాండి నెంబర్ 1 వారు నిర్మించినటువంటి నూతన భవన నిర్మాణ మరియు పూజా కార్యక్రమ మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మరియు సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులిమామిడి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించి, పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పిట్టల రమేష్, మండల కన్వీనర్ గౌడిచెర్ల యాదయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వడిగెపల్లి నాగరాజు, కార్యదర్శి ప్రభు, కోశాధికారి నీరుడి వెంకటేశం, సంఘ పెద్దలు గోనెరఘు, సత్తయ్య, వడిగేపల్లి యాదయ్య, నాగరాజు, బక్క యాదగిరి, వడ్ల పుష్పమ్మ, జనార్ధన్, సత్యనారాయణ, శ్రీనివాస్, ఆరూర్ అంజన్న మొదలగు వారు పాల్గొన్నారు.



# వివాహ వేడుకల్లో పాల్గొన్నా పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి కంగ్టి నవంబర్ 25**

నారాయణఖేడ్ నియోజకవర్గం, కంగ్టి మండల పరిధిలోని దెగుల్ వాడి గ్రామానికి చెందిన చాకలి రాజు కూతురి వివాహ వేడుకల్లో పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్ పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వాదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. వారితో పాటు పీఏసీఎస్ డైరెక్టర్ కుపేందర్ రెడ్డి, మధు (మాజీ సర్పంచ్), సంతోష్ రెడ్డి, ప్రకాష్, శివకుమార్, మారుతీ, కృష్ణా, శ్రీను, అనిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగాన్ని దర్శించుకున్న భక్తులు

**శంకర్‌పల్లి నవంబర్ 25 తెలుగు వెలుగు**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుల్లితెర నటి, గుండె నిండ గుడి గంటలు, వంటలక్క రాధా మనోహర్ సీరియల్స్ ఫేమ్ లక్ష్మి కార్తీక చివరి సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నటి లక్ష్మిని స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు సదానందం గౌడ్, వైస్ చైర్మన్ శేఖర్, కమిటీ సభ్యుడు దేవేందర్ రెడ్డి, దర్శన్ ఉన్నారు.



# నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## నేడు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి:

## రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్...

**తెలుగు వెలుగు కూసుమంచి నవంబర్ 25**

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద తెలిపే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ పులుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ...కేంద్రంలోని పాలకులు అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు, కార్మికులు, అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు.దింతో తీవ్రంగా నష్టపోతున్నారు. అన్ని పంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చుకు 50 శాతం అదనంగా జోడించి అమలు చేయాలని, రుణమాఫీ ని చట్టం చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్నారని గుర్తు చేశారు.లేబర్ 4 కోడ్స్ లను రద్దు చేయాలి, కాంట్రాక్టు విధానాన్ని నిషేధించాలి, రైతులందరికీ పూర్తిగా పంట రుణాలను మాఫీ చేయాలి, కనీస వేతనం నెలకు రూ .26 వేలు ,పెన్షన్, రూ.10 వేలు అందరికీ ఇవ్వాలి,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని ,రక్షణ, రైల్వే, ఆరోగ్యం, విద్య, విద్యుత్తును ప్రైవేటికరించవద్దుని, వ్యవసాయ రంగానికి వాడే మీటర్ల స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, డిమాండ్ చేశారు.అలాగే మహిళల సాధికారతం పెంపొందించాలి, మహిళలు చిన్నపిల్లలు దళితులు గిరిజనులు మైనార్టీలపై జరుగుతున్న దాడులను, హత్యలను అత్యాచార్లను, అరికట్టాలి సత్వర న్యాయం అందించే న్యాయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు తోటకూరి రాజశేఖర్ (రాజు) అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, రైతు కూలి సంఘం కూసుమంచి సబ్ డివిజన్ కమిటీ సభ్యులు బుర్ర సైదులు,వ్యకాస సంఘం మండల కార్యదర్శి మూడు గన్యా నాయక్, మండల నాయకులు హలవత్ బాలాజీ మూడు వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు




# రెసిడెన్షియల్ పాఠశాలలో నాణ్యమైన భోజనాన్ని అందించాలి

## -మాధురి,అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ),

**(సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి సదాశివపేట)**

ఈరోజు సదాశివపేట పట్టణంలో గల మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ పాఠశాలను రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మాధురి ఆకస్మికంగా సందర్శించడం జరిగింది.పాఠశాలలో గల భోజనశాల, స్టోర్ రూమ్ లను పరిశీలించి, భోజన నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారని, విద్యార్థులకు ప్రతిరోజు అందించె భోజనం రుచికరంగా ఉండాలని, మెన్యూ ప్రకారం అందించాలని,రోజు శుభ్రమైన,తాజా కూరగాయలను మరియు గుడ్లను వడ్డించాలని తెలిపారు. సదాశివపేట్ లో ని గోడౌన్ లో సివిల్ సప్లై లో ఉన్న బియ్యమును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సరస్వతి, మున్సిపల్ కమిషనర్ ఉమా,జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి ఎన్.శంకర్,సివిల్ సప్లై డిఎం కొండలరావు,మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మధుకర్ రావు,సిఆర్పి రాజేశ్వర్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ఖమ్మం ఎంపీ కార్యాలయంలో సిఎంఆర్ చెక్కుల పంపిణీ

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## లబ్ధిదారులకు అందజేసిన మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి

**తెలుగు వెలుగు ఖమ్మం నవంబర్ 25**

ఖమ్మం: ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్లలో చికిత్స పొందిన పేదలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. మధిర నియోజకవర్గానికి సంబంధించి చెక్కులు మంజూరు కాగా.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి హాజరై..అందజేశారు. మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల నుంచి 25 మందికి మొత్తం రూ. 5 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ..సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నామని, అంతా ధైర్యంగా ఉండాలని అభయమిచ్చారు.



# షిరిడీలో 'బాయిజమ్మ' వారి సాయి భోజన్






**ఉమ్మడి ఆదిలాబాద్ తెలుగు వెలుగు ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో గల సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ 5వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం షిరిడీలోని కండోభ దేవాలయం వద్ద గల సాయి ఆశ్రమ పాఠశాలలో ట్రస్ట్ మరియు దాతల సహకారంతో షిరిడిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. ఈ మహా కార్యక్రమం కోసం ట్రస్ట్ తరఫున సభ్యులు, సేవకులు 108 మందిమి రెండు రోజుల ముందుగానే షిరిడి కి తరలి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఏటా తాము నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా షిరిడి కి వెళ్లి మహా అన్నదాన కార్యక్రమం చేపట్టామని చెప్పారు. షిరిడీలోని సాయి ఆశ్రమ పాఠశాలకు వచ్చిన వందలాది మంది విద్యార్థులు భక్తులకు మరియు ఆలయ నిర్వహకులకు అన్నదానం నిర్వహించామని వివరించారు. ఈ సందర్భంగా వారు అన్నదానాన్ని స్వీకరించి భాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

**సనాతన ధర్మంలో భాగంగా సేవ**

బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ సనాతన ధర్మంలో భాగంగా ప్రతి సంవత్సరం శిరిడీలో అన్నదాన సేవ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగుతోందని వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. ట్రస్ట్ కార్యక్రమంలో భాగంగా నిత్యం పేద ప్రజలకు, విద్యార్థులకు, భక్తులకు, మారుమూల దళిత, గిరిజన, బలహీన, వెనుకబడిన తరగతుల వారికి అన్నదానం, చలికాలంలో దుప్పట్ల పంపిణీ వంటి సహాయ, సహకార కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు పేర్కొన్నారు.

**చాలా గొప్ప కార్యక్రమం**

షిరిడీలో కండోభ దేవాలయం వద్ద గల సాయి ఆశ్రమ పాఠశాలలో అన్నదాన కార్యక్రమం చేపట్టడం చాలా గొప్ప కార్యక్రమం అని సాయి ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు దుబల్ అభిమన్యు ఖండు అన్నారు. బాయిజమ్మ సాయి సేవ ట్రస్ట్ వారు ఈరోజు ఇంత పెద్ద కార్యక్రమం చేపట్టడం గర్వకారణం అని అన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వారిని అభినందించారు.

**బాయిజమ్మ నివాసం సందర్శన**

అన్నదానం అనంతరం బాయిజమ్మ నివాస గృహం సందర్శించి షిరిడి సాయి మహిమలు, బోధనలు సేవలు ట్రస్ట్ వారికి చూపించడం జరిగింది. బాయిజమ్మ సాయి పేరు మీద అన్నదాన సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందని బాయిజమ్మ కుటుంబ సభ్యులు నీలేశ్ కోతే, పంకజ్ ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

**మా ట్రస్ట్ కు మార్గదర్శకం**

షిరిడి సాయిబాబా వారి బోధనలు, సేవా కార్యక్రమాలు బాయిజమ్మ సేవలు ట్రస్ట్ కు మార్గదర్శకమని ట్రస్టు వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. జగద్గురువు సాయిబాబాకే ఆకలి తీర్చి ఎంతో పుణ్యం గడిచిన బాయిజమ్మ పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించే భాగ్యం దక్కడం తమ పూర్వజన్మ సుకృతం అని అన్నారు.

**అన్నదానం చేద్దాం...**

ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం- అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్- రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ గార్లు తెలిపారు ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్ , ట్రస్ట్ సభ్యులు జక్కం నాగమణి తిరుపతి, నల్ల శ్రీనివాస్ ,సేవకులు, భోగే మధుకర్, లద్దునూరి శ్రీనివాస్, ఐలయ్య, శేఖర్, మల్లేష్, హరిబాబు, కాంపల్లి స్నేహ సాయిరాజ్ కండోభ దేవాలయ నిర్వాహకులు సందీప్ మనోహర్ నగిరి, శ్రీ అజయ్ మనోహర్ నగిరే, దీపక్ మనోహర్ నగరి, అమూల్ కండోభ , నీలేష్ కోతే లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని కోరారు.

# మృత్యువుతో పోరాడి ఓడిన విద్యార్థిని శైలజ

**ఉమ్మడి ఆదిలాబాద్ తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 25**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన అశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కు గురై గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మృతి చెందింది. అక్టోబర్ 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు.వీరిలో ఇద్దరు కోలుగా శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు 20 రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాత పడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువు ల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకుల పాఠశాలలు అధ్వాన్నంగా మారి విద్యార్థులు చనిపోతున్నారని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.



# పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం.

**ఉమ్మడి ఆదిలాబాద్ కొమరం భీం జిల్లా ఆసిఫాబాద్ నవంబర్ 25**

**రెబ్బెన.తెలుగు వెలుగు ప్రతినిధి**

రెబ్బెన మండలంలోని గోలేటి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న దున .10వ తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాఠశాలలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఏ టి డబ్ల్యూ ఓ కమ్మర్ హుస్సేన్ .జి సి డి ఓ శకుంతల పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు చరవానులు విద్యార్థులకుఇవ్వద్దని ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను బోధించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు మేను ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ రూపకల్పన ప్రాముఖ్యతను ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేయాలి

**ఉమ్మడి ఆదిలాబాద్ తెలుగు వెలుగు నవంబర్ 25**

భారత రాజ్యాంగ రూపకల్పన ప్రాముఖ్యతను ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేయాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. సోమవారం మంచిర్యాలలో సంఘం నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నవంబర్ 26 భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకొని ఆయన మాట్లాడారు.. భారత రాజ్యాంగ రూప కల్పనకు 299 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయగా,అందులో 15 మంది మహిళలకు చోటు దక్కడం విశేషం అన్నారు. దేశంలో స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం ,సమన్యాయం, ప్రజాస్వామ్యం పరిడవిల్లడానికి రెండేళ్ల 11 నెలల 18 రోజులపాటు శ్రమించిన అనంతరం అఖండ భారత్ కు లిఖిత రాజ్యాంగాన్ని అందించారన్నారు.1949 నవంబర్ 26న అప్పటి రాజ్యాంగ పరిషత్ దీనికి ఆమోదం తెలిపిందన్నారు. నేటి కాలం యువతకు రాజ్యాంగ దినోత్సవం అనేది ఉందని అసలేంత మందికి తెలుసు? అని అన్నారు.అందరికీ జనవరి 26 న గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటున్న రోజు మాత్రమే తెలుసని,నవంబర్ 26 ప్రత్యేకత, దాని వెనుక గల ప్రాముఖ్యత చాలా తక్కువ మందికి తెలుసు అని అన్నారు.అటువంటి వారికి ఈరోజు ప్రాముఖ్యతను తెలియజేయడానికి ప్రభుత్వాలు విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అడ్వకేట్ మారపాక మల్లేష్, ఆడెపు సురేందర్, నడిపెల్లి సునీల్ రావు, హనుమండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాదులో నిర్వహించే మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయండి ........

**అన్నపురెడ్డిపల్లి :నవంబర్ 25 (తెలుగు వెలుగు ప్రతినిధి)**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల అన్నపురెడ్డి పల్లెలో ఏర్పాటుచేసిన మీటింగ్లో డిసెంబర్ 1వ తేదీ 2024న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయవలసిందిగా ఈరోజు అన్నపురెడ్డిపల్లి మాల మహానాడు ఆధ్వర్యంలో మీటింగ్ ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తక్షణమే దాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కు పిలుపునిచ్చిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, పాల్వంచ పట్టణ అధ్యక్షులు కాలువ రామారావు ,జిల్లా ఉపాధ్యక్షులు గందూరి శ్రీనివాసరావు, అన్నపురెడ్డిపల్లి మాల మహానాడు సభ్యులు చల్ల పుల్లయ్య ,చల్లా రాంబాబు, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, నల్లబెల్లి వెంకటేశ్వర్లు, పెంక్ వెంకటేశ్వర్లు ,చల్ల లక్షణరావు రుంజ వెంకటేశ్వర్లు.





# అంగన్వాడీలే అమ్మలై సంబురంగా జరుపుతున్న అక్షరాభ్యాసాలు

**ఉమ్మడి ఆదిలాబాద్ మంచిర్యాల్ జిల్లా నవంబర్ 25**

**తెలుగు వెలుగు ప్రతినిధి**

కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్రను పోషిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి

ఆడబిడ్డలు గర్భిణులైన నాటి నుండి వారు తినే ఆహారమైన లేదా నవ మాసాలు నిండాక చేసుకునే శ్రీమంతమైన ఎంతో సంబరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రదేశం అంగన్వాడికేంద్రం.ఈ అంగన్వాడి కేంద్రాలు ఆడబిడ్డలకు రెండవ తల్లిలా సమాజంలో ముఖ్యమైన భూమికను పోషిస్తున్నాయి. ఇలా జరిగే ముఖ్యమైన కార్యక్రమాలలో ప్రముఖంగా మంచిర్యాల జిల్లా, తాండూర్ మండలంలోని మాదారం-3 అంగన్వాడి కేంద్రం ముందంజలో ఉంది. అంగన్వాడి కేంద్రంలో విధులు నిర్వహించే కుశ్నపల్లి మీనా తన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అందించే పోషకాహారనందిస్తూ, సకాలంలో గర్భిణీలకు, పిల్లల తల్లులకు ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలు తెలియజేస్తూ పలు కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తుంది. ఈ కార్యక్రమాలలో భాగంగానే సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో పిల్లలకు అనే పాపకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, పిల్లలు ప్రభుత్వ అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కుశ్నపల్లి మీనా, గర్భిణీ స్త్రీలు, పిల్లలు పాల్గొన్నారు.



# సిర్పూర్ (టీ ) లో చోరీ, 2.5 తులాల బంగారం, 25 తులాల వెండి చోరీ

**కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా**

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 25**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలంలోని కౌటాల పోలీస్ స్టేషన్ నందు ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న సిర్పూర్ (టి) కి చెందిన అంగరి సాయిబాబా ఇంట్లో నిన్న రాత్రి జరిగిన దొంగతనం లో గుర్తు తెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడి 2.5 తులాల బంగారు ఆభరణాలు మరియు 25 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిర్పూర్ (టి) ఎస్ఐ తెలిపారు.



# అన్నపురెడ్డిపల్లి శివాలయంలో ఆఖరి కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం భక్తుల సందడి.........

**అన్నపురెడ్డిపల్లి :నవంబర్ 25 (తెలుగు వెలుగు ప్రతినిధి ).**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల అన్నపురెడ్డిపల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో విశేషంగా కార్తీక మాసంలో నాలుగవ సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ,అభిషేక కార్యక్రమాలు వైభవంగా ఆలయంలో నిర్వహించబడినవి. ఇట్టి కార్యక్రమంలో గోదావరి పెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ వారు శ్రీహరి రోహిణి , హనుమాన్ జంక్షన్ ఆంధ్ర ప్రదేశ్ మరియు రాజశేఖర్ ప్రవళిక దంపతులు ఎన్.ఆర్.ఐ వారు మరియు కాటి సైదులు. కుమారి దంపతులు ఖమ్మం వారు స్వామివారి మహా అన్నదాన సేవ ని నిర్వహించి ఉన్నారు. ఇట్టి అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు సుదూర ప్రాంత భక్తులు వేలాదిమందిగా తరలివచ్చి స్వామివారి మహా ప్రసాదాన్ని స్వీకరించి ఉన్నారు.







# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంఐఎం అధ్యక్షులు మోహీద్ పటేల్

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి నారాయణఖేడ్ నవంబర్ 25**

నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను సోమవారం నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మోహీద్ పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర థియేటర్ సమీపంలో, శ్రీ ముత్యాల పోచమ్మ దేవాలయం మరియు మహంకాళి దేవాలయం ప్రాంతాల్లో పరిశుభ్రత పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వెంకటేష్, చాంద్ పాషా, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.





# నిధులు సమకూర్చుకుంటూ సంక్షేమ పథకాల అమలు

... 500 బోనస్ తో ఎకరాకు పదివేల లబ్ది

...రికార్డు స్థాయిలో 22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

... రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**తెలుగు వెలుగు ప్రతినిధి రాయికల్ రూరల్ నవంబర్ 25**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తుందని,ఇచ్చిన హామీల అమలుకు నెలనెలా నిధులు సమకూర్చుకుంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.సోమవారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాళేశ్వరం, మేడిగడ్డ ఎత్తిపోతల అవసరం లేకుండానే వరద కాలువల నీటితో గతంలో కంటే రికార్డు స్థాయిలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలకు 500 రూపాయల బోనస్ అందిందని,దీంతో రైతుకు ఎకరాకు 10వేల లబ్ది చేకూరుతుందని తెలిపారు. జగిత్యాల జిల్లాలో గత సంవత్సరం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ కాగా, ఈ సీజన్లో 1 కోటి 44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని,గతం కంటే రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం కాంగ్రెస్ రైతు ప్రభుత్వం అనడానికి నిదర్శనమన్నారు.సన్న రకాల ధాన్యాన్ని బయట విక్రయిస్తే ప్రభుత్వం అందించే 500 బోనస్ వర్తించదని,కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ లభిస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 18 వేల కోట్లతో రైతులకు రుణమాఫీ చేపట్టిందని,సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు ప్రభుత్వం రుణమాఫీ అమలుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు రుణమాఫీ తో పాటు,సన్న రకాలకు 500 బోనస్ అందిస్తుందని దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ కానీ,సన్న రకాలకు 500 బోనస్ అందించిన రాష్ట్రం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి ప్రజలకు అండగా ఉండేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,500 రూపాయలకే సబ్సిడీ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం,రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి,ఆలయ చైర్మన్ లు దాసరి గంగాధర్, రాము,నాయకులు ఎద్దండి భూమారెడ్డి,బాపురపు నర్సయ్య,అత్తినేని గంగారెడ్డి,బత్తిని భూమయ్య,చింతలపల్లి గంగారెడ్డి,తలారి రాజేష్, కొమ్ముల ఆది రెడ్డి,షాకీర్,ఏలేటి జలంధర్,శ్రీకాంత్,నరసింహారెడ్డి,గుండేటి ఆనందం,అశోక్,రాజశేఖర్,రమేష్ నాయక్,నాగరాజు,శివ,రాజేష్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# చలి కాలం జర భద్రం అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

**కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 25**

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ దాడి పెరుగుతున్న న్యుమోనియా, అస్తమా కేసులు, చల్లటి వాతావరణంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ జ్వరం, ఆయాసం, స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. అస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డీసీజ్), అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. శ్వాసకోశ వ్యాధులతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఛెస్ట్, ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రుల ఓపీ విభాగానికి వచ్చే రోగుల్లో సీజన్‌కు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి.

**తేమ శాతం:**

వాతావరణ మార్పులతో చల్లటి గాలులకు శరీరం తెల్లగా పొడిబారినట్లు మారిపోతోంది. పెదవులు పగిలిపోయి, ముఖం కాంతి హీనంగా మారుతోంది. అరికాళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయి. శరీరంలో తేమ శాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయంటున్నారు. ముఖంపై పొడిబారిపోవడం వల్ల పగుళ్లు వస్తాయని వైద్యులు వివరించారు. చేతులపై పగుల మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయంటున్నారు. ఈ తరహా సమస్యలు మధుమేహం రోగులకు వస్తే ఇబ్బందులుంటాయని, ఇన్‌ఫెక్షన్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

**దగ్గు, ఆయాసం:**

వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు 'సీవియర్ అలర్జీ బ్రాంకైటిస్' బారినపడుతున్నారు. వాతావరణం మార్పుతో వైరస్ శక్తివంతం కావడంతో ప్రజలపై దాడి చేస్తోంది. దీంతో దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. ఐదారు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీలు ప్రస్తుతం వారం నుంచి రెండు వారాలు ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. న్యుమోనియా, అస్తమా వంటి జబ్బులుకూడా పెరిగాయంటున్నారు.

**అస్తమా ఉంటే అవస్థే:**

అస్తమా, న్యుమోనియా, సీవోపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారికి చలికాలం కష్టమేనని వైద్యులు అంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా అస్తమా సమస్య పెరుగుతుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే అస్తమా, న్యుమోనియా రోగులకు మరింత అసౌకర్యంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అస్తమా, న్యుమోనియాతో బాధపడేవారు మందులు వాడకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**నీరు వేడిచేసి తాగాలి:**

శ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సమస్యలున్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడిచేసి వడపోసుకుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతునొప్పి ఉన్న వారు ప్రతిరోజూ రెండుసార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి. ఐదారుసార్లు చేయాలి. ఇలా ఉదయం సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశముంది. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు తాగొద్దు. వేడి ఆహారం తీసుకోవాలి. ఈఎన్‌టీ సమస్యలున్న వారు వైద్యులను సంప్రదించి వారి సలహాలు పాటించాలి.

**గుండె జబ్బు బాధితులు జాగ్రత్తగా ఉండాలి:**

చలికాలంలో గుండె జబ్బులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్స్, కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండడంతో గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంటుంది. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా రక్తనాళాలు రప్చర్ అవుతుంటాయి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయొద్దు. అధిక బరువు, అస్తమా, గుండె జబ్బులున్న వారు వాకింగ్ విషయలో అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో స్మోకింగ్ చేయడం మానివేయాలి. స్మోకింగ్, విషపదార్థాల వల్ల ముప్పు ఏర్పడుతుంది. ఆల్కహాల్ తీసుకుంటే గుండె సమస్యలు వస్తాయి. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ బాధితులు అప్రమత్తంగా ఉండాలి. మధుమేహ రోగులు చల్లటి ప్రదేశంలో పడుకోవద్దు. పొగమంచు బారిన పడకుండా ఉండడానికి మాస్కులు ధరించాలి. గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. చలిగాలి ఉన్న సమయంలో వృద్ధులు బయట తిరగొద్దు అని వైద్య ఆరోగ్య శాఖ వారు తెలిపారు.



# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం:

## జిల్లా ఎస్ పి శ్రీనివాస రావు

**కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా**

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 25**

గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస రావు ఐపీఎస్. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ డివి శ్రీనివాస రావు ఐపీఎస్ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.



# అయ్యప్ప స్వామి దీక్షతో మానసిక ప్రశాంతత

**తెలుగు వెలుగు న్యూస్ పెద్ద శంకరంపేట్**

.పెద్ద శంకరంపేట పరిసర ప్రాంతాంలో రోజురోజుకు అయ్యప్ప దీక్ష పరులు పెరుగుతూ ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది అయ్యప్ప దీక్షా సమయం రాగానే ఈ ప్రాంతంలో ముఖ్యంగా యువకులు అయ్యప్ప దీక్ష తీసుకుని మండలం పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తూ సమాజానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ మెప్పును పొందుతూ న్నారు కార్తీక మాసం 13వ తేదీ నుండి పెద్ద శంకరంపేట పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఉపాలయంలో నేటి వరకు దాదాపు 95 మంది యువకులు అయ్యప్ప మాలలు ధరించి పూజలు నిర్వహిస్తున్నారు సోమవారం 38 మంది స్వాములు రామచంద్రాచారి గురుస్వామి చేతులు మీదుగా అయ్యప్ప మాలలు ధరించి దీక్షను స్వీకరించారు ఈ సందర్భంగా గురు స్వామి రామచంద్ర చారి మాట్లాడుతూ అయ్యప్ప మాలలు ఏ ప్రాంతంలోనైనా వయసు ఎక్కువ ఉన్నవారు ధరిస్తూ ఉంటారని కానీ శంకరంపేట ప్రాంతంలో ముఖ్యంగా యువత మాల ధారణకు ముందుకు రావడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టం అనే పేర్కొన్నారు నేడు యువత ఎన్నో చెడు అలవాట్లకు బానిసై వారి జీవితాలను పాడు చేసుకుంటున్నారని కానీ ఈ ప్రాంత యువకులు అయ్యప్ప శివ మాలలు వేసి ఆధ్యాత్మిక చింతనతో ఉంటూ సమాజానికి దైవత్వానికి తోడ్పడుతున్నారని అన్నారు సోమవారం మాల ధరించిన స్వాములలో రాములు గురు స్వామి శ్రీహరి గురుస్వామి బసవరాజు గురుస్వామి తోపాటు అయ్యప్ప కన్ని కత్తి గంట పెరు స్వాములు ఉన్నారు





# ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష.. 25000 వేల చొప్పున జరిమానా

**సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ఓపియం డ్రగ్స్ కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష రూ. 25000 వేల చొప్పున జరిమానాను సోమవారం విధిస్తూ తీర్పు వెల్లడించారు.వివరాల్లోకి వెళితే.. 2016 సంవత్సరములో పటాన్చెరువు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఓపియం అమ్మకాలు జరుపు ఇద్దరూ పట్టుబడ్డారు.పఠాన్ చెరువుకు చెందిన గొల్ల రమణ, రవీందర్ యాదవ్ లపై సీఐ రఘునాథరెడ్డి కేసు నమోదు చేశారు. 2016లో నమోదైన ఈ కేసులో సోమవారం సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ఇద్దరికీ ఐదేళ్లు జైలు శిక్ష రూపాయలు 25 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు.ఐదేళ్ల జైలు శిక్ష విధించడంతో కోర్టు కానిస్టేబుల్ నందు సింగ్ ఇద్దరినీ జైలుకు తరలించారు.డ్రగ్స్ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు చేపట్టినటువంటి ఎక్సైజ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలా సన్ రెడ్డి,సంగారెడ్డి మెదక్ డిప్యూటీ కమిషనర్ హరి కిషన్ అభినందించారు.



# సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు హెూమం

**మెదక్ జిల్లా తెలుగు వెలుగు శివంపేట ప్రతినిధి**

శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో సోమేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహెూత్సవం కనుల పండుగగా జరిగింది. ధ్వజస్తంభం దాత ఇంద్రేశం వాస్తవ్యులు పట్లోళ్ల బలరాం కు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఆలయ పండితులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వచ్చిన భక్తులకు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, కొడకంచి శ్రీనివాస్ గౌడ్, రమణ గౌడ్, పత్రల శ్రీనివాస్ గౌడ్, రాజిపేట వెంకటేశ్వర్, మరియు గూడూరు గ్రామస్తులు తదితరులు ప్రతిష్టాపన మహెూత్సవంలో పాల్గొన్నారు.





# యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా

## గనవేని మల్లేష్ యాదవ్

**తెలుగు వెలుగు ప్రతినిధి**

**రాయికల్ నవంబర్. 25.**

యాదవ సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని రాయికల్ పట్టణంలోని గుడేటి రెడ్డి ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించి. యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు..

**యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా:**గనవేని మల్లేష్ యాదవ్ **అడహాక్ కమిటీ జిల్లా సలహా దారులుగా :**తొట్ల చిన్నయ్య యాదవ్ ,రెబ్బాస్ మల్లయ్య యాదవ్ ,కొలుముల రమణ యాదవ్,బల్కం మల్లేష్ యాదవ్,దండవేణి మల్లయ్య యాదవ్,ముక్కెర శేఖర్ యాదవ్,జిల్లా కార్యవర్గ సభ్యులు గా,మాధం వినోద్ యాదవ్,అంకం శంకర్ యాదవ్,కొక్కెర శేఖర్ యాదవ్,చిర్రం ప్రకాష్ యాదవ్ **అడహాక్ కమిటీ మండలాల ఇంచార్జిలుగా 1.మెట్ పల్లి మండలం :**తిప్పన వేని రవి యాదవ్,పోతారపు రమేష్ యాదవ్,లక్కం మల్లేష్ యాదవ్ **2.కోరుట్ల మండలం :** కల్లూరి దేవన్న యాదవ్,డబుల్ మల్లేష్ యాదవ్ **3.కోరుట్ల టౌన్ :**జాల వినోద్ యాదవ్,జాల తిరుపతి యాదవ్ **4.మల్లాపూర్ మండలం :**మెడ కొకల శ్రీనివాస్ యాదవ్, బోయిని సిద్దయ్య యాదవ్,జెల్ల ప్రసాద్ యాదవ్,మ్యాకల అంజయ్య యాదవ్,బైరి రవి యాదవ్



**5.రాయికల్ టౌన్ :**ఆసరి మల్లేష్ యాదవ్,గంగవేణి కొమురయ్య యాదవ్, **6.రాయికల్ మండలం :**గంగుల తిరుపతి యాదవ్,గంగుల శ్రీనివాస్ యాదవ్, **7.బీర్ పూర్ మండలం :**చల్ల లక్ష్మణ్ యాదవ్,ఊరేడి కొమురెల్లి యాదవ్, **8.సారంగాపూర్ మండలం :**చిర్రం గంగన్న యాదవ్,మానుక గంగన్న యాదవ్, 9.ధర్మపురి మండలం,జక్కుల భూమేష్ యాదవ్, **10.బుగ్గారాం మండలం :**ఎరవేని వినోద్ యాదవ్, **11.మల్యాల మండలం :**కొక్కెర మల్లేష్ యాదవ్, **12. మేడి పల్లి మండలం :**జాల శేఖర్ యాదవ్,ఐలవేణి సాయి యాదవ్ **13.కథలా పూర్ మండలం :**బర్ల మధు యాదవ్,రాచర్ల రవి యాదవ్,మ్యాదరవేణి రామాఆంజనేయ యాదవ్ **14.జగిత్యాల మండలం :**బైరి మహేష్ యాదవ్,(ప్రకాష్ యాదవ్), **15.గొల్లపల్లి మండలం :**ఆవుల వెంకటేష్ యాదవ్,కాలువ శ్రీనివాస్ యాదవ్,జక్కుల తిరుపతి యాదవ్ లను సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు సమిష్టిగా ఎన్నుకోవడం జరిగింది.. ఈ కమిటీ సభ్యులు వారి వారి మండలాలలో మిగతా యాదవులను కలుపుకుని సంఘ బలోపేతం, సభ్యత్వం గురించి తెలియచేసి జిల్లాలోని అన్ని గ్రామాలలో అందరికి తెలియచేసి సభ్యత్వం చేయించాలని నిర్ణయించనైనది..సభత్వ రుసుము 200/- రూపాయలు గా నిర్ణయించడం జరిగింది.తొందరగా సభ్యత్వాలు పూర్తి చేసి సభ్యత్వం తీసుకున్న సభ్యుల ఓటింగ్ ద్వార జిల్లా మండల కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది..మొదటి సభ్యత్వాలను అలిశెట్టి భుచ్చి రాములు, తొట్ల చిన్నయ్య యాదవులకు అందించి సభ్యత్వాల డ్రైవ్ ని ప్రారంభించిన అడహాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ జిల్లా కార్యవర్గ సభ్యులు..

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..

## కేంద్రాల్లోనే రైతులకు వెంటనే ధాన్యం రశీదులు..

## 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ..

## సన్నవడ్లకు బోనస్ చెల్లింపు..

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..

**తెలుగు వెలుగు ప్రతినిధి**

ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామంలో ముదిగొండ ప్రాధమిక పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తో కలిసి ప్రారంభించారు..ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ...కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రాల్లో రైతులకు రశీదులు ఇస్తున్నామని తెలిపారు.రైతులకు 48 గంటల్లో ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ 5 రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని రాయల తెలిపారు. రైతులెవరు అధైర్యపడవద్దని సన్నవడ్లు సాగు చేసుకున్న ప్రతి ఒక్కరికి బోనస్ అందుతుందని హామీ ఇచ్చారు. రానున్న యాసంగిలో తెగుళ్లను తట్టుకునే వరి రకాలను సాగు చేసుకోవాలని రైతులకు వివరించారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు..ఎలాంటి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయిస్తానని హామీ ఇచ్చారు..ప్రతి గింజకు మద్దతు ధర చెల్లించి వడ్లను కొనుగోలు చేఇస్తామని చెప్పారు. రైతులకు ఎక్కడ మోసం జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు వడ్ల కటింగ్ పేరిట రైతులను నిలువునా ముంచారని ఆరోపించారు..ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమ్మినేని రమేష్ బాబు,సోసైటీ అధ్యక్షులు తూపాకుల యలగోండ స్వామి, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్ బాబు, మండల నాయకులు ఇలవల పుల్లారెడ్డి, కోలేటి నాగేశ్వరరావు,నంజాల నరసింహారావు,గ్రామ మాజీ సర్పంచ్ చిలకల విజేత రామకృష్ణ,%ాఖ% రహీంతుల్లా,ఏనబోయిన చిన్న పుల్లయ్య, కోలేటి జానకిరామ్, నోముల నాగేశ్వరరావు, చిర్రా లింగయ్య, కోలేటి చిన్న నాగేశ్వరరావు,చిలకల ఉపేందర్, మార్తి నాగరాజు, వడ్డే మాధవరావు, ఏలూరి హనుమంతరావు , అలవాల మల్లయ్య, ఏలూరి నాగేశ్వరరావు , మీగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..



# నిబద్ధత, క్రమశిక్షణకు మారుపేరు సగరులు, సగర కులస్తుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడతా...





## పేద ,మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

## పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ...

**తెలుగు వెలుగు ప్రతినిధి**

నిబద్ధత, క్రమశిక్షణకు మారుపేరు సగరులు, సగర కులస్తుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడతా నని పిఎసి చైర్మన్ శేర్లింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ కాలనీ లో గల సగర సంగం కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు భవనం ప్రారంభోత్సవానికి స్థానిక కార్పొరేటర్ రోజా దేవి రంగారావుతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాల అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాటుపడుతోందని, నిబద్దత క్రమశిక్షణకు మారుపేరైన సగరుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడతానని తెలియచేసారు. ప్రభుత్వం అన్ని వర్గాల, అన్ని కులాల శ్రేయస్సు కోసం పాటుపడుతోందని చెప్పారు. ప్రధానంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో సగర కులస్తులతో తనకు అవినాభావ సంబంధాలు ఉన్నాయని చెప్పారు. క్రమశిక్షణతో పాటు నిబద్దతతో సగర కులస్తులు వ్యవహరిస్తూ ఉంటారన్నారు. మిగతా కుల సంఘాలకు సగర సంఘ వారు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. నిరంతరం తాను నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి పెడతానని అందులో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నానని చెప్పారు. గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధిని తాను ఎమ్మెల్యే అయిన తర్వాత చేపట్టి శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖచిత్రాన్ని అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మార్చి వేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ తనకు మద్దతు తెలిపి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రజలకు రుణపడి ఉంటూ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సగర మహిళా సంఘం వారు మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రానికి కుట్టు మిషన్లు ఇవ్వవలసిందిగా అభ్యర్థించగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే సగర మహిళ భవనం నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు , జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. జగద్గిరిగుట్ట సగర సంగం ప్రధాన కార్యదర్శి ఆస్కానీ శ్రీనివాస్ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు,సగర ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆస్కానీ మారుతి సాగర్, జగద్గిరిగుట్ట సగర సంగం అధ్యక్షులు ఆస్కానీ కొండయ్య సాగర్, కోశాధికారి కొమ్ముల రాజేష్ సాగర్, సాగర సంగం రాష్ట్ర నాయకులు కే పి రామ్ సాగర్, రమేష్ సాగర్, కె.పి రాములు సాగర్, ఎం రాములు సాగర్, జి సత్యనారాయణ సాగర్ మరియు గౌరవ సలహాదారులు, సగర మహిళా సంఘం అధ్యక్షురాలు జి కుసుమసాగర్, కోశాధికారి సిహెచ్ జ్యోతి సాగర్, వార్డు కమిటీ సభ్యులు చంద్రమోహన్ సాగర్, యువజన సంఘం అధ్యక్షులు ఎం మురళి సాగర్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శేఖర్ సాగర్, కోశాధికారి సంపత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి రామాలయంలో చివరి సోమవారం సందర్భంగా దీపాలంకరణ మరియు హనుమాన్ చాలీసా ....................

**అన్నపురెడ్డిపల్లి: నవంబర్ 25 (తెలుగు వెలుగు ప్రతినిధి )**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా , ప్రత్యేకమైన పూజలు,దీపాలాంకరణ కార్యక్రమం,హనుమాన్ చాలీసా కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామాలయ సేవ బృందం చల్లపల్లి వెంకటేశ్వర్లు, బొంకూరి సురేష్, గునగంటి శ్యామ్ కుమార్, గాజుల రాంబాబు, ఇజ్జిగిరి సత్యం, నాగల్ల నరసింహారావు,, మరియు వికాస తరంగిణి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.





# ప్రజావాణి ఫిర్యాధులను సమన్వయంతో పరిష్కరించాలి :

## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దొత్రే

**కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా**

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి, నవంబర్ : 25**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దొత్రే అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను స్వికరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 42 దరఖాస్తులు వచ్చాయి అని, అధికారులు సమన్వయంతో ప్రజావాణి దరఖాస్తులోని ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు.



# చదరంగంతో మానసిక ప్రశాంతత

**కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా**

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 25**



ఆసిఫాబాద్: చదరంగం ఆడటం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందని డిఎస్ఓ (జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్) మీనా రెడ్డి అన్నారు, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ మోడల్ స్కూల్ (గర్ల్స్)లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ చాంపియన్షిప్ పోటీల బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన అతను మాట్లాడారు. ఆసిఫాబాద్ లో నిర్వహించడం ఎంతో అభినందనీయం అన్నారు మారముల గ్రామాలలో కూడా క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా చెస్ అసోసియేషన్ కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడను నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రపంచ క్రీడారంగంలో చదరంగం ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. చదరంగంలో రాణించడం వల్ల మేధాశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళా నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ఈ క్రీడలో రాణిస్తున్న వారికి విద్యా,ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు ఇట్టి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు ఈ సందర్భంగా పలువురు విజేతలకి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ ఈగ కనకయ్య, కొమరం భీం జిల్లా అధ్యక్షులు ఎస్ సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ మల్లికార్జున్, ఏసియంఓ ఉద్ధవ్, చెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన, టోర్నమెంట్ కన్వీనర్ ఎం రవీందర్, జాయింట్ సెక్రెటరీ %వీ%. తిరుపతి, శృతిక,సమ్మయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# బట్టు దీవెన బ్రహ్మ దీవన..

## రెవెన్యూ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న కూకట్పల్లి ఎమ్మెల్యే...

### ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం.యుగంధర్ రెడ్డి

తెలుగు వెలుగు ప్రతినిధి



కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణి విషయంలో కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రెవెన్యూ అధికారులను భయపెట్టించుకుంటూ పనులు చేయించుకుంటున్నాడని ఈ విధమైన వ్యవహారం ఎమ్మెల్యేకు తగదని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం. యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించాడు. అధికారులు చెక్కులను పంపిణీ చేసే వరకు కూడా ఎమ్మెల్యే ఆగక పోవడం విడ్డురంగా ఉందని అన్నారు. సోమవారం కూకట్పల్లి ఎమ్మెల్యే తన నివాసంలో విలేఖరుల సమావేశంలో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల విషయం లో బాలానగర్ కూకట్పల్లి తహాసీల్దార్ లను మల్కాజిగిరి ఆర్డీఓ ను చెక్కులు అందజేయడంలో ఎమ్మెల్యే చేసిన బ్లాక్ మెయిల్, బెదిరింపులు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చెక్కులు అందించడంలో అధికారులు అన్నీ సరుచేసుకుని పంపిణీ చేయాల్సిన అవసరం చాలా ఉందని, దానికి అనుగుణంగానే అధికారులు వ్యవహారించాల్సి వస్తుందని, దానికే ఎదో కొంపలు మునిగి పోయినట్లు ఎమ్మెల్యే ఉగిపోతున్నారని అన్నారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 6 నెలలకు ఒక్కసారి చెక్కులు వచ్చిన దాఖలాలు ఉన్నాయని, రికార్డులు తెప్పించుకుని చూసుకువాల్సిందిగా యుగంధర్ రెడ్డి సూచించారు.

## కూకట్పల్లి లో ఘనంగా వీరశైవ లింగాయత్ సామూహిక వ్రతాలు, ఇష్ట లింగ పూజలు...

తెలుగు వెలుగు ప్రతినిధి

కూకట్పల్లి వీరశైవ లింగాయత్ సమాజం వారు నిర్వహించిన తొమ్మిదవ సామూహిక ఉమామహేశ్వర వ్రతములు , సామూహిక ఇష్ట లింగ పూజ మరియు నూతన లింగ పునః లింగ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తీక మాస లింగాయత్ వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, లింగాయత్ సమాజ్ గౌరవ అధ్యక్షులు నేతి మహేష్ , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజా రంగారావు, సమాజం అధ్యక్షులు అల్లిబద్రన్న తదితరులు పాల్గొన్నారు.



## కార్తిక మాసం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన

### ఎర్రవల్లి సతీష్ రావు...

తెలుగు వెలుగు ప్రతినిధి

కార్తీక మాసం సందర్భంగా ఆఖరి సోమవారంని పురస్కరించుకొని అల్వీన్ కాలనీ డివిజన్ లో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు దేవాలయ కమిటీ సభ్యుల ఆతిథ్యం మెరకు ఎన్టీఆర్ నగర్ లోని కాశి విఘ్నేశ్వర స్వామి మరియు దత్తాత్రేయ కాలనీ లో గల నాగలింగేశ్వర స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొని పూజలు నిర్వహించారు.



## న్యాయవాది శ్రీనివాసరావు గృహప్రవేశానికి హాజరైన

### ఎమ్మెల్యే కృష్ణారావు, ఎర్రబెల్లి సతీష్ రావు...

తెలుగు వెలుగు ప్రతినిధి

కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని శిల్పా బృందావన్ కాలనీ లో న్యాయవాది శ్రీనివాస్ రావు నూతన గృహ ప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ముఖ్య అతిథులను సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, తన్నీరు మహేష్, కూకట్ పల్లి జోన్ బిల్డర్స్ జనరల్ సెక్రటరీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.







### సందడిగా భట్రాజుల వనబోజన వేడుకలు..

తెలుగు వెలుగు ప్రతినిధి

బట్టు దీవన బ్రహ్మ దీవన అని ఎంతో మంది సన్మార్గంలో నడిపించిన గొప్ప పండిత విద్వాంసులని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు.కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి నల్లగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో భట్రాజు సంఘం మేడ్చల్ జిల్లా,కుత్బుల్లాపూర్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 21 వ వనభోజన మహోత్సవ వేడుకలకు ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ లు వేరువేరుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మూడోసారి ఈ నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా తన గెలుపునకు భట్రాజు కులస్తులు కీలక భూమిక పోషించారని తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వం భట్రాజుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని ఈ ప్రాంత కులస్తులకు తన వంతు సహాయ సహకారాలు అందజేయడంతో పాటు సంఘ భవనానికి తన వంతు సహాకారం అందజేస్తానని తెలిపారు.కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఈ నియోజకవర్గం భట్రాజుల అభ్యున్నతికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం టెక్ మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ ఉడుమూడి రాఘవరాజు వారి తల్లిదండ్రుల వి.వి.ఎల్.ఎన్.రాజు,శారద దంపతులు జ్ఞాపకార్థం,పోరంకి నాంచార్రాజు,వనజకుమారిల జ్ఞాపకార్థం వారి కుమారుడు కృషి హై స్కూల్ అధినేత పోరంకి శ్యాంప్రసాద్ రాజు ఇంటర్ తో పాటు పై చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ చేతుల మీదుగా కమిటీ సభ్యులతో కలిసి నగదు పురస్కారాలను అందజేశారు.ఆ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పండితులుగా,విద్వాంసులుగా స్థిరపడ్డారని తమ కులస్తులు కూడా సామాజికంగా,ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు.తమను అన్ని రంగాలలో ప్రభుత్వం గుర్తించి సరైన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అనంతరం వివాహ పరిచయ వేదికతో పాటు మహిళలకు పలు క్రీడలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి.ఈ కార్యక్రమంలో విద్యా ఉపాధి కమిటీ చైర్మన్ కేశిపెద్ది నరసింహారాజు,వ్యవసాయ యూనివర్సిటీ సైంటిస్ట్ దామోదర్ రాజు,భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు,మహిళా ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం సావిత్రి యువజన విభాగం అధ్యక్షులు కూరపాటి నరసింహారాజు,మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లోలబట్టు కృష్ణంరాజు,రాష్ట్ర ప్రతినిధులు చక్రాల రేవతి నంద్ భట్,నియోజకవర్గ అధ్యక్షులు తంగేళ్ల రాధాకృష్ణ భట్,ప్రధాన కార్యదర్శి సరికొండ పాపరాజు,కమిటీ సభ్యులు ఉడుమూడి వీర రాగవరాజు,ఉడుమూడి లక్ష్మి నర్సింహా రాజు,కూరపాటి శ్రీరామరాజు,సరస్వతి నరేందర్ రాజు,వి.శ్రీనివాస్ రాజు,వి.వీరంరాజు,ఉడుమూడి రాగవరాజు,శ్యామ్ ప్రసాద్ రాజు, కరుణాకర్ రాజు, సరికొండ శ్రీనివాస్ రాజు,మొగాసాటి సుధీర్ రాజు,శివాజీ రాజు,జనార్ధన్ రాజు,లక్ష్మణ్ రాజు,దురేందర్ రాజు,కృష్ణం రాజు,హరిదాస్ సంతోష్ రాజు,వేమ శేషంరాజు,సత్యవాణి,సుజాత,పరమేశ్వరి, కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

## కాంగ్రెస్ ప్రభుత్వం పై ధర్నా చేస్తావా...తెలంగాణ కోసం ఏనాడైనా చేశావా?

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ది బ్లాక్ మెయిల్ రాజకీయం...

### సీఎం రేవంత్ రెడ్డి పై విమర్శలు మానుకోవాలి.

### కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి...

తెలుగు వెలుగు ప్రతినిధి



కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు వచ్చినప్పటికీ కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో చెక్కులు ఇవ్వడం లేదని విమర్శిస్తూ మాట్లాడిన మాటలకు శేరి సతీష్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం మీడియాతో మాట్లాడుతూ తన మీద కోపంతో కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆపకండి కూకట్ పల్లి నియోజకవర్గంలో నెల రోజులుగా 550 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు నిలిపివేశారని ఆరోపించారు. మంత్రి చేతుల మీదగా లబ్ధిదారులకు అందజేస్తామని నెల రోజులుగా అధికారులు చెపుతున్నా ఇవ్వడం లేదని కృష్ణారావు విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేయలేదా అని ప్రశ్నించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మీరు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటుంటే మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారు? ఏ విధంగానైనా మిమ్మల్ని ప్రోటోకాల్ విషయంలో ఇబ్బందులకు గురి చేశారు? అనవసరమైన ఎమోషనల్ మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అస్థిరపరిచే విధంగా ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. ప్రజల కోసం రాజకీయ పార్టీగా ప్రజాప్రతినిధిగా మాట్లాడడానికి అవకాశం ఉంటుంది కానీ అబద్ధాలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి విప్ మహేందర్ రెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బండి రమేష్ లపై విమర్శలు చేస్తే సహించ ప్రసక్తే లేదన్నారు. రేపు ఉదయం 11 గంటల వరకు లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేయకపోతే ఏంఆర్వో ఆఫీసు దగ్గర ధర్నా చేస్తా అని స్పష్టం చేశారు. ఏనాడైనా తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో ధర్నా చేశావా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నార నీ ఎదవ చేశారు. 72 వేల మెజార్టీతో గెలిచానని జబ్బలు చరుచుకోవడం కాదు, మరి పార్లమెంట్ ఎన్నికల్లో ఆ 72,000 ఓట్లు ఎక్కడికి పోయాయయో చెప్పగలవా అని ప్రశ్నించారు. ఎవరు ఏమిటో అనేది భవిష్యత్తులో తెలుస్తుందని శేరి సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, నియోజకవర్గం కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రేష్మ, నజీర్ బాయ్, అక్బర్, పిడికిలి గోపాల్ చౌదరి, శేషగిరి నాయుడుతదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమం...

తెలుగు వెలుగు ప్రతినిధి

హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మాల ధారణ చేసుకున్న స్వాముల కోసం జగద్గిరిగుట్ట లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ప్రతిరోజు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. జగద్గిరిగుట్ట శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో గల కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుండి స్వాముల కోసం భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి డిసెంబర్ 31వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 గంటలకు స్వాముల భిక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని స్వాములు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన బిక్ష కార్యక్రమం సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు కార్పొరేటర్ శేషగిరిరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు రేగురి ప్రవీణ్ కుమార్, కాంట్రాక్టర్ శంకర్ గుప్తా, రమేష్ గుప్తా, స్వామి గుప్తా, కైలాసం గుప్తా తదితరులు పాల్గొన్నారు.





## డంపింగ్ యార్డులో మౌలిక వసతులు కల్పించాలి:

### ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్..

తెలుగు వెలుగు ప్రతినిధి

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి హెచ్ఎంటి ఖాళీ ప్రదేశంలో గల చెత్త సేకరణ డంపింగ్ యార్డులో మౌలిక వసతులు, క్యాంటీన్ సౌకర్యాలు కల్పించాలని ఐ.ఎన్.టి.యు సి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు సోమవారం డంపింగ్ యార్డ్ కేంద్రాన్ని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు.పారిశుద్ధ్య చెత్త సేకరణ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఉదయం ఐదు గంటలకు బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిరుపేద కార్మికులు ట్రాలీ వెంబడి ఉండి చెత్త సేకరిస్తామని అల్పాహారం,భోజనం సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ,ఆటోకార్మికులు డంపింగ్ లో పనిచేసే వారు మొత్తం దాదాపు 400 మంది వరకు ఉంటారని వీరికి ప్రభుత్వం జిహెచ్ఎంసి,రామ్కీ అధికారులు క్యాంటీన్ తాగునీరు వంటి వసతులు తక్షణమే కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రేటర్ కమిషనర్ ఐదు రూపాయల భోజనం వసతి వసతికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.వీరి సమస్యలను కార్మిక నాయకులు,మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హనుమంత రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ వారికి ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాయంలో ప్రజాపాలనలో కార్మికులందరికీ న్యాయం జరుగుతుందని వారికి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు ఎం.జనార్ధన్,చెత్త సేకరణ కార్మికులు దాసు,కృష్ణ, ఎల్లయ్య,రాంకీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు, రోడ్లు

**నిర్మాన నిర్వహణ ఇక సులభతరం**

**టోల్ వసూలుతో నిర్వహణా భారం**

**ఎపిలో ప్రయోగాత్మక అమలుకు నిర్ణయం**

**అమరావతి,నవంబర్25తెలుగు వెలుగు :**

తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో బాగా ఫోకస్ పెడుతున్నారు. శీఘ్రగతిన అభివృద్ధితో పాటు,ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు. గోదావరి నీటిని పెన్నాకు తరలించడానికి నదుల అనుసంధాన ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలిస్తున్నారు. కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం కు తరలిస్తారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ తరహాలో బ్యారేజీ నిర్మిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు



సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు–నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుంది. ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రూ.70 వేల కోట్లు కావాలి. అంత మొత్తం ప్రభుత్వం వద్ద ఉండదు. అందుకే చంద్రబాబు ఖఖఖ మోడల్ గురించి ఆలోచిస్తున్నారు. రోడ్లు, ప్రాజెక్టులు ప్రైవేటు, ప్రభుత్వ పార్టనర్ షిప్‌లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఆయా కంపెనీలు ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపిస్తారు. టోల్ వసూలు చేస్తారా నీటి తీరువా వసూలు చేస్తారా మరొకటా అన్నది తర్వాత. రైతుల పంటలకు కావాల్సినంత నీరు సదుపాయం వస్తే.. అంత కంటే కావాల్సిందేమీ ఉండదని అంచనా వేస్తున్నారు. ఖఖఖ విధానంతో ఏపీని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు నుంచీ చెబుతున్నారు . ప్రజల ఆదాయాలను పెంచితే వారు ఈ విధానం ద్వారా మేలు జరిగితే ఎంతో కొంత పన్నులు కట్టేందుకు సిద్ధంగా ఉంటారు. మేలు జరగకపోతే మాత్రం ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

## మెన్స్ హెయిర్ స్టైల్ షాపును ప్రారంభించిన జనంపల్లి పురందరెడ్డి...

**తెలుగు వెలుగు ప్రతినిధి**

వివేక నంద నగర్ కాలనీ మెయిన్ రోడ్ లో మెన్స్ హెయిర్ స్టైల్ షాపును అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కస్టమర్లకు అందుబాటులో ఉండి వారి ఇష్ట ప్రకారం ఎయిర్ స్టైల్ కటింగ్ చేసి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సరసమైన ధరలకు కస్టమర్లను ఆకట్టుకొని బిజినెస్ డెవలప్ చేసుకోవాల్సిందిగా ప్రోపరేటర్ రవి నాయి రవికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ శ్రీధర్ రావు సూర్యనారాయణ హొటల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్పస్వామి దేవాలయంలో 16 నుండి 26 వరకు నిత్య అన్నదానం:

**తెలుగు వెలుగు ప్రతినిధి**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలో గల బాలా శాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పంచశీల కాలనీ రెసిడెన్షియల్ ఇండస్ట్రియల్ సౌజన్యంతో ఈనెల 16 డిసెంబర్ 26 వరకు అయ్యప్ప మాలధారణ స్వాములకు నిత్య అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.పరిసర ప్రాంతాల అయ్యప్ప మాలధారణ స్వాములు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.సోమవారం ఆలయంలో పది మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి వేసు కున్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు..



## ఈ 29న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన రద్దు

**తుపాను హెచ్చరికలతో ప్రధాని పర్యటన రద్దు**

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన పర్యటన రద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించాల్సి ఉంది. అయితే ప్రతికూల వాతావరణ హెచ్చరికలతో మోదీ పర్యటన రద్దు అయినట్లు పీఎంవో తెలిపింది. అనకాపల్లి పూడిమడకలోని ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనతో పాటు జాతీయ రహదారుల అంకితం, కొన్ని రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ పర్యటనలో భాగంగా విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ స్టేడియంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ సైతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తీవ్ర వాయుగుండంగా మారుతోంది. అనంతరం అది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసినట్లు ప్రధాని కార్యాలయం సోమవారం వెల్లడించింది.



## సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు ఎదురుదెబ్బ

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును విజయ్‌పాల్ ఆశ్రయించారు. అయితే దీనిపై ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, విజయ్‌పాల్ తరఫు న్యాయవాదులు సుధీర్ఘ వాదనలు వినిపించారు. వారి వాదనలు విన్న అనంతరం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరలే ధర్మాసనం విజయపాల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అసలు కస్టోడియల్ టార్చరే జరగలేదని, అరెస్టు వ్యవహారంతో విజయ్ పాల్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు విపిపించారు. 2021లో ఘటన జరిగితే మూడేళ్ల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరుపుతున్నారని సుప్రీంకోర్టు ధర్మాసనానికి సింఘ్వీ తెలిపారు. ఇప్పటివరకూ ఏ కోర్టూ రఘురామను టార్చర్ చేసినట్లు ధృవీకరించలేదని ఆయన చెప్పారు. రఘురామ అరెస్టు కావడంతో సుప్రీంకోర్టే బెయిల్ ఇచ్చి అతన్ని ఆర్మీ ఆస్పత్రికి చికిత్స కోసం పంపించిన తీరును ధర్మాసనానికి ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ ఆర్మీ ఆస్పత్రి వైద్య నివేదిక కూడా ఇచ్చిందని, దానిలో స్పష్టంగా అన్ని అంశాలూ ఉన్నాయని లూథ్ర తెలిపారు. 2021 నుంచి ఇప్పటి వరకూ ఒక్కరోజూ రఘురామకృష్ణరాజు ఖాళీగా కూర్చోలేదని, న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారని సుప్రీంకోర్టుకు ఆయన తరఫు న్యాయవాది సుయోధన్ చెప్పారు. ఆర్ఆర్ఆర్‌ను మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టినప్పుడు ఆయన కాళ్లకైన గాయాలను న్యాయాధికారికి చూపగా... ఆ వివరాలను అధికారికంగా నమోదు చేశారని ధర్మాసనానికి సుయోధన్ చెప్పారు. సుప్రీంకోర్టు సూచనలతో స్వతంత్ర దర్యాప్తు చేయాలని ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఆయన సుప్రీంకోర్టుకు వెల్లడించారు. ఇంకా ఆ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లోనే ఉందని రఘురామ న్యాయవాది చెప్పారు. మరోసారి వాదనలు వినిపించేందుకు సిద్ధం కాగా.. మేజిస్ట్రేట్ నమోదు చేసిన వివరాలపై సమాధానం ఉందా? అంటూ విజయ్‌పాల్ న్యాయవాది సింఘ్వీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో కేసు విచారణను సుప్రీంకోర్టు ముగించింది. విజయ్‌పాల్ పిటిషన్ కొట్టివేస్తూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరలే ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## సందడిగా గోకుల యాదవ సంఘం వనభోజన ఉత్సవాలు..

**తెలుగు వెలుగు ప్రతినిధి**

గోకుల యాదవుల సంక్షేమానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు కార్తీక మాసం పురస్కరించుకొని గోకుల యాదవ సంఘం కుత్బుల్లాపూర్ శాఖ ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక మాస వనభోజన మహోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో అధ్యక్షులు ఎల్ వెంకట్రావు యాదవ్,గౌరవ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్,గౌరవ సలహాదారులు వెంకటేశ్వర్లు యాదవ్,ప్రధాన కార్యదర్శి జి.తిరుమల రాజ్ యాదవ్,కార్యనిర్వాహక అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ యాదవ్,కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి..



## ఢిల్లీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లారు. ఆయన ఎవరితో అయినా సమావేశం అవుతారా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. అయితే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇంట్లో జరగనున్న ఓ శుభకార్యంలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు కాబట్టి అధికారికంగా ప్రకటించలేదని అంటున్నారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ రెండో సారి ఢిల్లీ వెళ్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆయన ఢిల్లీ వెళ్లి అమిత్ షాతో సమావేశం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం కోసం ఆయనను అమిత్ షా పిలిచినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత ఇప్పుడు మరోసారి ఢిల్లీ వెళ్తున్నారు. పవన్ కల్యాణ్ ఢిల్లీలో రాజకీయ పరమైన సమావేశాలు జరిపే అవకాశం లేదేని అలాగే.. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎంగా కేంద్ర మంత్రుల్ని.. కూడా కలిసే అవకాశం లేదని ఈ ఢిల్లీ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదేనని జనసేన వర్గాలు చెబుతున్నాయి. పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో ఎన్డీఏకు కీలక మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్రలో చురుకుగా ప్రచారం చేయడంతో ఆయన ప్రచారం చేసిన అన్ని ప్రాంతాల్లోనూ అభ్యర్థులు మంచి విజయం సాధించారు. బీజేపీ అగ్రనేతల సూచనల మేరకే పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో ఎక్కువగా హిందూత్వవాదాన్ని వినిపిస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఈ విషయంలో స్పష్టత లేదు. ఈ అంశంపై ఆయన ఎప్పుడూ నేరుగా బీజేపీ నేతలతో సంప్రదింపులు జరపలేదు. తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని తేలిన తర్వాత ఆయన సనాతన ధర్మ పోరాటాన్ని ఎంచుకున్నారు. ప్రత్యేకంగా వారాహి డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. తమిళనాడులో డీఎంకే రాజకీయ వారుసజిగా పేరు తెచ్చుకున్న యువనేత, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ విమర్శలు గుప్పించారు. తరపున హిందూత్వ వాదాన్ని తమిళనాడులో వినిపించేందుకు పవన్ ను ఉపయోగించుకుంటారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఏమైనా రహస్య సమావేశాలు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన ఆసక్తి రేపుతోంది.



## రూ.1000 తగ్గిన పసిడి

**గ్లోబల్ మార్కెట్‌లో 1.45 శాతం పడిపోయిన గోల్డ్**

**హైదరాబాద్,నవంబర్25తెలుగు వెలుగు :**

యూఎస్ డాలర్ బలం కోల్పోవడంతో పాటు ప్రాంతీయ–రాజకీయ ఉద్రిక్తతలు క్రమంగా సద్దుమణగడంతో గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్ ఈ రోజు 1.45 శాతం పడిపోయింది. ప్రస్తుతం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 2,672 డాలర్ల వద్దకు చేరింది. ఈ రోజు, మన దేశంలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ?(24 కేరెట్లు) ధర 1,090 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ ?(22 కేరెట్లు) ధర 1,000 రూపాయలు, 18 కేరెట్ల బంగారం రేటు 820 రూపాయల చొప్పున తగ్గాయి. కిలో వెండి ధర 500 రూపాయలు దిగి వచ్చింది.హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78,550 వద్దకుబీ 22 క్యారెట్ల బంగారం ధర రూ. 72,000 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర రూ. 58,910 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో రూ. 1,00,500 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది.విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78,550 వద్దకుబీ 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర రూ. 72,000 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర రూ. 58,910 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర రూ. 1,00,500 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది. మన దేశంలో, 10 గ్రాముల 'ప్లాటినం' ధర రూ. 26,140 వద్ద ఉంది. హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం సహా దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధర అమల్లో ఉంది. పసిడి, వెండి, ప్లాటినం సహా అలంకరణ లోహాల ధరలు ప్రతిరోజూ మారుతుంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో గోల్డ్ రేట్లు పెరగడం/ తగ్గడం వల్ల మన దేశంలోనూ ధరలు మారుతుంటాయి. ప్రపంచ మార్కెట్‌లో అలంకరణ లోహాల రేట్లు పెరగడానికి/ తగ్గడానికి చాలా కారకాలు పని చేస్తాయి. ప్రాంతీయ–రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, కేంద్ర బ్యాంకుల వద్ద పసిడి నిల్వలు, వడ్డీ రేట్లలో మార్పులు, వివిధ జ్యువెలరీ మార్కెట్లలోని డిమాండ్‌లో హెచ్చుతగ్గులు వంటి ఎన్నో అంశాలు అలంకరణ లోహాల ధరలను ప్రభావితం చేస్తాయి.



## కాపు కులస్తులకు అండగా ఉంటా:

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్..**

**తెలుగు వెలుగు ప్రతినిధి**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాపు కులస్తులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు.ఆదివారం కార్తీక మాస పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి (రిజిస్టర్డ్)ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో 27వ కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు వనభోజన వేడుకలు ఐకమత్యానికి నిదర్శనం అన్నారు. నియోజకవర్గం లోని సూరారం ప్రాంతంలో 266 చదరపు గజాల స్థలాన్ని కాపు సేవా సమితి సంఘ భవనానికి కేటాయించినట్లు తెలిపారు.ఈ ప్రాంత కాపు కులస్తులకు అండగా ఉంటానని తెలిపారు.అనంతరం కుల పెద్దలు కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన ను శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర బ్యాంకు విశ్రాంత డైరెక్టర్ పరసా పరమేశ్వర్ రావు,బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మిర్యాల రాఘవరావు,హైకోర్టు అడ్వకేట్ సుంకరి దిలీప్,తెలంగాణ కాపునాడు అధ్యక్షులు, దేవాదాయ శాఖ ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంధం కరుణాకర్ నాయుడు, సంఘపెద్ద డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్,అడపా భాస్కరరావు కుత్బుల్లాపూర్ కాపు సేవా సమితి ప్రతినిధులు పక్కాల దుర్గారావు,గౌరీశెట్టి శివఈశ్వర్ రావు,కోనేటి సత్యనారాయణ,సత్తి ఏసుబాబు,పాలపర్తి రామచంద్రరావు,పసుపులేటి సత్యనారాయణ,అచ్యుత సుబ్రమణ్యం,తెలుగశెట్టి బాల పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి..



# కేసీఆర్ పాలనలోనే బీసీలకు న్యాయం

## కులగణనకు చట్టబద్ధత ఉందా..? : ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

కులగణనకు చట్టబద్ధత ఉందోలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, యునైటెడ్ పులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి డెడికేటెడ్ కులగణన కమిషన్‌కు 35 పేజీలతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం బీసీలకు ఎంతో న్యాయం చేసిందన్నారు. కులగణకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ ద్వంద వైఖరిని బీసీలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టు షాక్

**హైదరాబాద్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. హౌసింగ్ సొసైటీలకు కేటాయించిన భూ కేటాయింపులను రద్దు చేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టు సొసైటీలకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వాలు భూములు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వాలు బుక్ కేటాయింపులు చేయడాన్ని సవాల్ చేస్తూ రావు బీ చెలికాని సుప్రీకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పును వెలువరించింది. కాగా, జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో సభ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ 8న హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఇండ్ల స్థలాల కేటాయింపు పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి అందించారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హౌసింగ్ సొసైటీలు పొందిన భూముల విషయమై సందిగ్ధం నెలకొన్నది.



# సైకిల్‌పై పార్లమెంట్‌కు వచ్చిన టీడీపీ ఎంపీ

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లారు. పసుపు రంగు సైకిల్‌పై పసుపు రంగు అంగీ, తెల్ల దోవతి, తలకు తలపాగా ధరించి ఆయన పార్లమెంటుకు చేరుకున్నారు. అయితే అప్పల నాయుడు ఆ విధంగా పార్లమెంట్ వెళ్లడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోతుంది. దట్టంగా పొగమంచు కమ్ముకుని ఉదయం తొమ్మిదింటి వరకు కూడా ఏమీ కనపడని దుస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అప్పలనాయుడు గుర్తుచేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రభుత్వానికి ఆ సందేశం చేరవేసేందుకు అప్పలనాయుడు అలా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ తమ వంతుగా బాధ్యత తీసుకోవాలని సూచించారు.



# అండమాన్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టివేత

**న్యూఢిల్లీ, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

అండమాన్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఫిషింగ్ బోట్ నుంచి దాదాపు 5 టన్నుల డ్రగ్స్‌ను ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కోస్ట్‌గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదక ద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి అని రక్షణ అధికారులు తెలిపారు. 'అండమాన్ తీరంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. సుమారు 5 టన్నుల డ్రగ్స్‌ను పట్టుకుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి' అని డిఫెన్స్ అధికారి ఒకరు తెలిపారు.




# అర్ధరాత్రి శ్మశానంలో కోడిని బలిచ్చిన అఘోరీ

## కేసు నమోదు చేసిన వరంగల్ పోలీసులు

**వరంగల్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

నాగసాధు అఘోరీ .. ఈ పేరు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో మార్మోగుతోంది. తన వికృత చేష్టలతో అటు మీడియా, ఇటు సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేసింది. తాజాగా, అఘోరీ ఊహించని వివాదంలో చిక్కుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడిని చంపినందుకు గానూ ఆమెపై కేసు నమోదైంది. ఈ నెల 19వ తేదీన వరంగల్ నగర శివారులోని బెస్తంచెరువు శ్మశాన వాటికలో పూజలు చేసిన అఘోరి వికృత చేష్టలకు పాల్పడింది. రెండు రోజులు శ్మశానంలో విడిది చేసి అక్కడ విచిత్ర పూజలు చేసి బహిరంగంగానే కోడిని బలిచ్చింది. ఇది చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అయ్యింది. శ్మశానంలో కోడిని బలివ్వడంపై కరీంనగర్ జిల్లాకు చెందిన జంతు ప్రేమికులు, లా విద్యార్థులు కసిరెడ్డి రోహన్ రెడ్డి, సౌమిత్ పటేల్‌లు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మామునూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వీడియోలను పోలీసులకు సమర్పించారు. బహిరంగంగా కోడిని బలిచ్చి రక్తార్పణ చేయడం నేరమని.. కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అఘోరీపై సెక్షన్ 325 కింద కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు అఘోరికి ఎఫ్ఐఆర్ అందజేయడంతో పాటు స్టేషన్ బెయిల్ మంజూరు చేయరని పిటిషనర్ రోహన్ రెడ్డి తెలిపారు. రెండు నెలల్లోపు ఛార్జ్ షీట్ నమోదు చేస్తారని చెప్పారు. కేసు నిరూపణ అయితే ఒక్క రోజు నుంచి 5 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడే ఛాన్స్ ఉంటుందని అన్నారు. ఏ మతం వారైనా దేవుళ్ల పేరుతో జంతుబలి ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. ప్రస్తుతం అఘోరీ ఎక్కడ ఉందో పోలీసులు గుర్తించలేదు. గత కొద్ది రోజులుగా ఏపీలో ఆలయాల వద్ద నాగసాధు అఘోరీ హల్చల్ చేసింది. కారులో ప్రయాణిస్తూ వివిధ ఆలయాలకు వెళ్లగా.. నగ్నంగా ఉండడంతో దర్శనానికి అనుమతించలేదు. అనంతరం ఆమె దుస్తులు ధరించి ఆలయాలను సందర్శించారు. ఇటీవలే మంగళగిరిలో



నడిరోడ్డుపై హల్చల్ చేయగా పోలీసులు అఘోరీని అతి కష్టం మీద నిలువరించారు. మంగళగిరి హైవేపై బైఠాయించగా.. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఆమె వారిపై దాడికి పాల్పడింది. అనంతరం తెలంగాణకు చేరుకుంది. ఈ క్రమంలోనే సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందూ ధర్మం రక్షణ కోసం పోరాడుతుంటే.. తనను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అఘోరీ మండిపడ్డారు. హిందూ దేవాలయాలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటానని అన్నారు. తెలంగాణలో తనను ఆపే మగాడు ఇంకా పుట్టలేదని పేర్కొన్నారు. తెలంగాణలో ఆలయాలు ధ్వంసం అవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని తెలిపింది. స్త్రీలపై దాడులను ఆపే శక్తి మన దగ్గర ఉందని చెప్పుకొచ్చింది. గో హత్యలను నివారించేందుకు పోరాడదామని చెప్పుకొచ్చింది.

# త్రీవీలర్స్ బ్యాన్ చేయండి

## రోడ్డు ప్రమాదాలకు కారణం ఆటోలే

## జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్డు ప్రమాదాలకు కారణం ఆటోలేనని.. వాటిని నిషేధించాలని అన్నారు. మైనర్లు, డ్రైవర్లు మద్యం మత్తులోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని.. అయితే వాటిపై అధికారులు కన్నెత్తి చూడడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ రెండు రోజులు హడావుడి చేసి వదిలేస్తారని మండిపడ్డారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతదేహాలను ఆయన పరిశీలించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సరిపోదని.. బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. కాగా, అనంతపురం జిల్లాలో శనివారం జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు శనివారం ఉదయం గార్లదిన్నె మండలం తిమ్మంపేటలోని ఓ అరటి తోటలో పనికి వెళ్లారు. మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో పనులు ముగించుకుని ఆటోలో తిరుగు పయనమవుతుండగా.. ఆటో తలగాసిపల్లి సమీపంలో హైదరాబాద్ – బెంగుళూరు జాతీయ రహదారిని దాటుతుండగా ప్రమాదానికి గురైంది. ధర్మవరం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను బలంగా ఢీకొనగా ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆటోలో పరిమితికి మించి కూలీలను తరలిస్తుండగా ప్రమాద తీవ్రత పెరిగినట్లు తెలుస్తోంది. అటు, ఘటన జరిగిన ప్రాంతంలో వేగ నిరోధకాలు ఉన్నా బస్సు డ్రైవర్ బ్రేక్ వేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



# రేపటికి వాయిదా పడ్డ శీతాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు.. తొలుత ఇటీవలేకాలంలో మృతి చెందిన సభ్యులకు సంతాపం తెలిపాయి. ఆ తర్వాత లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడ్డాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓంబిర్లా సభను బుధవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో ఎగువ సభను చైర్మన్ ధన్‌కర్ బుధవారానికి వాయిదా వేశారు. ఉభయ సభలు బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్, ఢిల్లీలో వాయు కాలుష్యం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి.



# వరుడి మెడలో దండను లాక్కెళ్లిన ట్రక్ డ్రైవర్

**లక్నో, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

ఉత్తరప్రదేశ్‌లో ఓ పెళ్లి వేడుకలో ఊహించని సీన్ జరిగింది. మరికాసేపట్లో పెళ్లి జరుగుతుందనంగా.. వరుడు ఎంతో ఉత్సాహంగా గుర్రంపై ఊరేగింపుగా వేదిక వద్దకు బయల్దేరాడు. మెడలో కరెన్సీ దండతో డప్పు వాయిద్యాలు, డ్యాన్సుల మధ్య ఎంతో ఉత్సాహంగా వెళ్తున్నాడు. ఇంతలో ఊహించని ఘటన చోటు చేసుకుంది. అటుగా వెళ్తున్న ఓమినీ ట్రక్ డ్రైవర్.. వరుడి మెడలోని కరెన్సీ మాలను లాక్కెళ్లిపోయాడు. ఈ ఘటన మీరట్‌లో చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన వరుడు.. పెళ్లి మండపానికి బదులు మాల కోసం ఆ ట్రక్ డ్రైవర్ వెంట పరిగెత్తాడు. గుర్రం దిగి బైక్ ఎక్కాడు. హైవే వెంబడి ట్రక్‌ను వెంబడించాడు. సినిమా లెవల్లో ట్రక్‌పైకెక్కి క్యాబిన్లోకి దూరాడు. తన డబ్బుల దండను డ్రైవర్ వద్ద నుంచి లాక్కొన్నాడు. అనంతరం వాహనం ఆపి సదరు డ్రైవర్‌ను చితకొట్టాడు. ఇంతలో వరుడి బంధువులు కూడా అక్కడికి చేరుకొని అంతా కలిసి ట్రక్ డ్రైవర్‌ను చితకబాదారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.



# డైరెక్టర్ రాంగోపాల్ వర్మ అరెస్టుకు రంగం సిద్ధం

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ అరెస్ట్‌కు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసులో పోలీసుల విచారణకు వర్మ డుమ్మా కొడుతూ వస్తున్నారు. ఈరోజు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం పంపారు. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు సరాసరి హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. ఆయన్ని అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. డుమ్మా కొట్టాడు. సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల విచారణకు రాలేనని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బాబుకు వాట్సాప్‌లో రాంగోపాల్ వర్మ మెసేజ్ పెట్టాడు. విచారణకు సహకరిస్తానని, వారం రోజులు గడువు ఇవ్వాలని పోలీసులను కోరాడు. దీంతో పోలీసులు వర్మకు మరోసారి నోటీసులు జారీ చేశారు. సోమవారం విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ సారి కూడా డుమ్మా కొట్టడంతో పోలీసులు నేరుగా వర్మ ఇంటికి వెళ్లారు.



# మహా పీఠంపై ఎవరు? తెరపైకి కొత్త ముఖాలు !



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. 'మహాయుతి' బంపర్ మెజార్టీ సాధించింది. అయితే, ఇప్పుడు వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న.. ముఖ్యమంత్రి పదవి ఎవరికి ఇస్తారు? కూటమిలోని బీజేపీ, ఎన్సీపీ, శివసేనల్లో ఏ పార్టీకి ఆ పదవి దక్కుతుంది? ఏ నేత ఆ కుర్చీలో కూర్చుంటారనేది ఆసక్తి కలిగిస్తున్న ప్రశ్న. శివసేన నేత ఏక్‌నాథ్ శిందే ఆ పదవిని వదులుకుని అత్యధికంగా 132 సీట్లు గెలిచిన బీజేపీకి చెందిన మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు మద్దతు ఇస్తారా?ఒకవేళ ఎక్కువ సీట్లు గెలిచిన బీజేపీకే సీఎం పదవి ఇస్తే ఫడణవీస్‌కే అవకాశం దొరుకుతుందా? లేదంటే కొత్తవారికి చాన్స్ వస్తుందా? కూటమిలోని మరో పార్టీ నేషనలిస్ట్ కాంగ్రెస్ నేత అజిత్ పవార్ కూడా రేసులోకి వస్తారా? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికితే కొత్త సీఎం ఎవరనే ప్రశ్నకు జవాబు చెప్పడం సులభమవుతుంది. హారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ శిందే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కూటమి ఆయన్ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదు. మహా వికాస్ అఘాడి పరిస్థితీ అదే. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తే తమ మధ్య గొడవలు రావచ్చని పార్టీల నేతలు ఆందోళన చెంది ఉండవచ్చు. అందుకే ఈ వ్యవహారాన్ని ఎన్నికల తర్వాత తేల్చుకోవాలని భావించి ముందుగా ప్రకటన చేయలేదు. కానీ, ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఎన్నికలకు ముందు మహా వికాస్ అఘాడిలో ముఖ్యమంత్రి పదవి మీద చాలా గందరగోళం ఉంది. ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా ముఖ్యమంత్రి పదవికి ముందుకు రావడానికి ఆసక్తి చూపించారు. అయితే కూటమిలోని మరో రెండు పార్టీలు కాంగ్రెస్, ఎన్సీపీ ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఇక 'మహాయుతి'లో ఎన్నికలకు ముందు అలాంటి గందరగోళం లేదు. ఈ కూటమి కూడా సీఎం అభ్యర్థిని ముందుగా ప్రకటించనప్పటికీ నేతలెవరూ దానిపై ఆసక్తి కనబరుస్తూ ప్రకటనలేమీ చేయలేదు. అయితే.. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవికి అనేక 'ఆప్షన్స్' ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించింది కాబట్టి ఆ పార్టీ నేత సీఎం కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, త్వరలో ముంబయి కార్పొరేషన్ సహా, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో అవన్నీ దృష్టిలో పెట్టుకుని బీజేపీలోనే కొత్త ముఖాలను తీసుకువచ్చే అవకాశం కూడా లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అదే నేతను సీఎంగా కొనసాగించడం లేదాఎన్నికల ఫలితాల తర్వాత మరొకరికి అవకాశం ఇవ్వడం కూడా జరగొచ్చని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మరాఠా రిజర్వేషన్లపై కోర్టు నిర్ణయం వెలువడే వరకు ఏక్‌నాథ్ శిందేను ముఖ్యమంత్రిగా కొనసాగించడం మరో ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. 'మళ్లీ వస్తా' అని ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఫడణవీస్‌కు అవకాశం ఇచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేము. బీజేపీ నుంచే కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసి ఫడణవీస్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొనే అవకాశాలూ ఉండొచ్చు. అనేక ఆప్షన్స్ ఉన్నప్పటికీ ఏక్‌నాథ్ శిందే, ఫడణవీస్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శివసేన, ఎన్సీపీలో సీఎం అభ్యర్థులు ఒక్కొక్కరే ఉన్నారు కానీ బీజేపీలో ఆ సంఖ్య పెద్దదే. ఫడణవీస్ కాకుండా వినిపించే మరో పేరు వినోద్ తావ్డే.హారాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు 'ఎదిగిన' వినోద్ తావ్డే 2014 నుంచి ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. ఆయన ఈసారి ముఖ్యమంత్రి కాగలరా? ఎన్నికలకు కేవలం ఒక రోజు ముందు, గోరేగావ్‌లోని వివంతా హోటల్ దగ్గర తావ్డే డబ్బు పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తూ బహుజన్ వికాస్ అఘాడి కార్యకర్తలు వినోద్ తావ్డేను చుట్టుముట్టారు.ఈ కేసు జనం నోళ్లలో నానింది. ఈ కేసు కారణంగా వినోద్ తావ్డేతో పాటు బీజేపీకి కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సంఘటన జరగడానికి కొన్ని రోజుల ముందు, మహాయుతి కూటమి అధికారంలోకి వస్తే పాత ముఖాన్ని తిరిగి తీసుకురావచ్చు లేదా పూర్తిగా కొత్త ముఖాన్ని ఇవ్వవచ్చు అని తావ్డే అన్నారు. ఆయన ప్రకటన తర్వాత పెద్ద ఎత్తున చర్చ జరిగింది. వినోద్ ముఖ్యమంత్రి పదవి కోసం ఆసక్తిగా ఉన్నారని ఊహాగానాలు వచ్చాయి. అయితే, వినోద్ తావ్డే ఇప్పుడు ముఖ్యమంత్రి కాగలరా అనేది కాలమే నిర్ణయించాలి. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు వినోద్ తావ్డే, ఏక్‌నాథ్ ఖడ్సే, పంకజ ముండే పేర్లు చర్చలో ఉన్నాయి. ఖడ్సే ప్రస్తుతం శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో ఉన్నారు. దాంతో ఆయనకు ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు. పంకజ ముండేకు కూడా అవకాశం రావొచ్చని అంటారు కొందరు విశ్లేషకులు. లోక్‌సభ ఎన్నికలలో పంకజ ముండే ఓడిపోయారు. అయినప్పటికీ మహారాష్ట్ర బీజేపీలో ఆమె కీలక మహిళా నేత.ముఖ్యమంత్రి పదవికి మహిళా నేతలను పరిగణనలోకి తీసుకుంటే ఆమె ముందుంటారు. అయితే, మహారాష్ట్రలో బీజేపీ కొత్త ముఖంతో ప్రయోగాలు చేసే అవకాశాలు తక్కువే .

# కేటీఆర్‌కు ఘన స్వాగతం

**హైదరాబాద్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

లగచర్లలో దళిత, గిరిజన రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిన తీరును నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ధర్నా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ రోడ్డుమార్గాన మానుకోటకు బయల్దేరారు. యాదాద్రి భువనగిరి జిల్లా కొత్తగూడెం ఎక్స్ రోడ్స్ వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఈ నెల 21న మహాధర్నా నిర్వహించాలని పార్టీ తలపెట్టినా, కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులపై ఒత్తిడి తెచ్చి అనుమతి నిరాకరించేలా చేసింది. దీంతో జిల్లా నేతలు హైకోర్టును ఆశ్రయించి ఈనెల 25న మహా ధర్నా నిర్వహించేందుకు అనుమతి పొందారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానుండటంతో బీఆర్ఎస్ నాయకులు మానుకోటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ఏర్పాట్లు చేశారు.





# రాచనాగుల రహస్యం బయటపడింది

**తెలుగు వెలుగు ప్రతినిధి**



పేరుకు తగినట్టుగానే రాచనాగు చాలా పొడవైన పాము. దీనినే కింగ్ కోబ్రా అంటామను. ఇది మూడు నుంచి నాలుగు అడుగుల పొడవు ఉంటుంది. దీన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.సాధారణంగా ఇది మనుషులకు దూరంగా ఉంటుంది. అయినప్పటికీ వాటిపైన సర్వేలు నిర్వహించే సమయంలో, లేదా వాటిని రక్షించే సమయంలో, లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాచనాగులు మనుషులపై దాడి చేసే ప్రమాదం ఉంది. అలాంటి పరిస్థితిలోనే, సరీసృపాల పరిశోధకులు డాక్టర్ గౌరీ శంకర్‌ను 2005లో కోబ్రా కాటు వేసింది. ఏనుగును సైతం చంపగల ఈ విషసర్పం కాటు వేసిన తర్వాత, ఆయన మరణం అంచుల వరకు వెళ్లి వచ్చారు. ఆ తర్వాత కోబ్రాపై ఆయన మరింత నిశితంగా పరిశోధనలు చేయడం ప్రారంభించారు. ఈ పరిశోధనల్లో భాగంగా ఆయన బృందం 180 ఏళ్లకు పైగా వెలుగుచూడని ఓ శాస్త్రీయ రహస్యాన్ని బయటకు తీసింది. ÷ారతదేశంలో పాము కాటుకు, ప్రత్యేకించి కోబ్రా కాటుకు ఎలాంటి మందూ లేదు. థాయ్‌లాండ్ నుంచి ఔషధాలు దిగుమతి చేసుకుంటాం. డాక్టర్ గౌరీ శంకర్‌ను పాము కరిచినపుడు థాయ్‌లాండ్ నుంచి తెచ్చిన ఔషధం ఆయన శరీరానికి సరిపడలేదు. అలాగే భారత్‌లో అందుబాటులో ఉన్న కంబైన్డ్ ఎ÷-లాసెంటల్ ఔషధం కూడా అలర్జీలకు కారణమవుతోంది.అదృష్టవశాత్తూ ఆ పాము ఆయన్ని పూర్తిస్థాయిలో కాటేయలేదు. కోబ్రా విషం వల్ల కలిగే నాడీ సంబంధిత సమస్యలకు యాంటీ ఎమెటిక్ డ్రగ్స్ సరిగ్గా పనిచేయకపోతే పాము కాటు తర్వాత కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది. కరోనా మహమ్మారి విజృంభించిన తొలినాళ్లలో సరైన మందులు లేకపోవడంతో పాము కాటు తర్వాత అతనిలో కనిపించిన లక్షణాల ఆధారంగా చికిత్స అందించారు.చాలా అడ్డంకులను దాటుకుని చివరకు గౌరీ శంకర్ కోలుకున్నారు. తర రకాల పాములపై చేసినన్ని అధ్యయనాలు కింగ్ కోబ్రాపై జరగలేదు. గత 15 ఏళ్లుగా మాత్రమే ఇలాంటి అధ్యయనాలు మొదలయ్యాయి. ఇన్నేళ్లుగా నిర్వహించిన అధ్యయనాలన్నీ.. బంధించి ఉన్న కోబ్రాలపై మాత్రమే జరిగాయి. కోబ్రాల సహజ ఆవాసాలలో లోతైన అధ్యయనాలు జరగలేదు. అందుకే వాటి గురించిన శాస్త్రీయ నిజాలు అనేక ఏళు ్లగా బయటకు రాలేదు. ప్రపంచంలో మొత్తం నాలుగు రకాల కోబ్రా జాతులున్నాయి. కోబ్రా జాతులను గుర్తించి, పేర్లు పెట్టేందుకు 1961వరకు ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి ఫలించలేదు. డాక్టర్ గౌరీ శంకర్ బఈందం పూర్తి సమాచారంతో ఇప్పుడు అది చేయగలిగారు. క్కో రకం కోబ్రా ఒక్కో తరహా ప్రత్యేక భౌగోళిక పరిస్థితుల్లో నివసిస్తుంది. పశ్చిమ కనుమలలో ఒక్క జాతికి చెందిన రాచనాగు మాత్రమే ఉంది.న్నాళ్లూ భారతదేశంలో ఓఫియోఫేగస్ హన్నా అనే శాస్త్రీయ నామం ఉన్న ఒక రాచనాగు జాతి మాత్రమే నివసిస్తుందని భావించారు. అదే శాస్త్రీయ నామానికి చెందిన రాచనాగ జాతులు ఉత్తర భారతదేశంలో, తూర్పు భారత్‌లో ఉన్నాయని గుర్తించారు. అలాగే తూర్పు పాకిస్తాన్‌లోనూ అవి ఉన్నాయి. ఈ రాచనాగు, పశ్చిమ కనుమలలో నివసించే రాచనాగు రెండు విభిన్నజాతులకు చెందినవి. దశాబ్దంపాటు డాక్టర్ గౌరీ శంకర్, ఆయన బృందం నిర్వహించిన పరిశోధనలో ఇది తేలింది.తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని పశ్చిమ కనుమల్లో నివసించే ప్రత్యేక జాతి ప్రపంచంలో మరెక్కడా లేదని ఈ అధ్యయనంలో తేలింది. పరిశోధకులు ఈ ప్రత్యేకమైన కింగ్ స్నేక్‌కు ఓఫియోఫాగస్ కళింగ అని పేరు కూడా పెట్టారు. ÷ాచనాగు అని పిలుస్తున్నప్పటికీ, ఇవి శాస్త్రీయంగా కోబ్రా కుటుంబానికి చెందినవే, కానీ వీటి లక్షణాలు వేరుగా ఉంటాయి. రెండు రకాల పాముల ఆవాసాలు, జీవనశైలి, ప్రవర్తనలో తేడాలు ఉన్నాయి. కోబ్రాలు నాజా జాతికి చెందినవి. కానీ, రాచనాగులను ఓపియోఫేగస్ జాతి కింద వర్గీకరించారు. శరీర పరిమాణంలో రెండింటికీ చాలా తేడా ఉంది. కోబ్రాలు 6 నుంచి 8 అడుగుల వరకు పెరుగుతాయి. కానీ భారతదేశంలో కనిపించే రాచనాగు గరిష్ఠంగా 14 అడుగుల వరకు పెరుగుతుంది. కోబ్రా శరీరమంతా ఒకే రంగులో ఉంటుంది. కానీ కింగ్ కోబ్రా శరీరంపై లేత రంగులో చారలుంటాయి. నుషులు నివసించే ప్రాంతాలలో డ్రాగన్ ఎక్కువగా కనిపిస్తుంటుంది. అయితే, రాచనాగులు ఎక్కువగా దట్టమైన, ఎత్తైన అడవులలో నివసిస్తాయి. ఇటీవలి కాలంలో అవి జనావాసాల్లో కూడా కనిపిస్తున్నాయి. ఒకే చోట ఒకటి కంటే ఎక్కువ కోబ్రాలు కనిపిస్తే ఆందోళన కలుగుతుంది. అయితే రాచనాగులు మనుషులు నివసించే ప్రాంతాల్లో ఉండగలవు. అంతే కాకుండా అవి తీసుకునే ఆహారంలో, సంతానోత్పత్తి విధానంలో తేడాలున్నాయి. రాచనాగులకు గూడు కట్టుకుని, అందులో గుడ్లు పెట్టే అలవాటు ఉంది. గుడ్లు పొదిగి పిల్లలయ్యేదాకా ఆ పాములు వాటిని జాగ్రత్తగా సంరక్షిస్తాయి. కోబ్రాలకు కూడా గుడ్లను సంరక్షించే అలవాటు ఉన్నప్పటికీ... వాటికి గూడు కట్టుకునే అలవాటు లేదు. వీటితో పాటు ఈ రెండింటి మధ్య ఇంకో ముఖ్యమైన తేడా ఉంది. చి÷-టటెలుకలు, పక్షులు, కప్పలు వంటివాటిని కోబ్రాలు తింటాయి. కానీ కింగ్ కోబ్రా తినే ఆహారంలో ఇతర పాములు మొదటి ప్రాధాన్యంగా ఉంటాయి. పచ్చపాములను, ఇతర చిన్న పాములను ఇవి తింటాయి. కింగ్ కోబ్రా కాటు వల్ల మరణించే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. భారత్‌లో యాంటీ ఎమెటిక్స్ అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టకపోడానికి ఇది ఓ కారణం. భారత దేశంలో కోబ్రా కాటువేయడం చాలా తక్కువగా జరుగుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల కొంచెం ఇవి పెరిగాయి. దీని కాటుకు పూర్తి స్థాయిలో మందు లేదు. వీటి మందుతయారీపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

# వేములవాడ రాజన్నకు పోటెత్తిన భక్తులు

**వేములవాడ, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న సన్నిధిలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బారులు తీరడంతో గర్భాలయంలో ఆర్జిత, అన్న పూజల సేవలను అధికారులు రద్దు చేశారు. స్వామివారి దర్శనానికి 3 గంటలకుపైగా సమయం పడుతున్నది. భద్రాచలంలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. నదిలో కార్తిక దీపాలు వదిలారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు.. కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గరళకంఠుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా, నవంబర్ 2న ప్రారంభమైన కార్మిక మాత్రం ఈ వారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కార్మిక మాస చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు.



# బ్యాగులు గుర్తించిన అధికారులకు షాక్..

## ప్రయాణికుల వద్ద విష సర్పాలు

**హైదరాబాద్, నవంబర్ 25 తెలుగు వెలుగు :**

శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులను చెక్ చేసిన అధికారులు షాక్‌కు గురయ్యారు. ఎయిర్‌పోర్టులో పాములు పట్టుబడటంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. సోమవారం ఉదయం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఇద్దరు మహిళల వద్ద విష సర్పాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వాటిని ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నిస్తున్నారు. బ్యాంకాక్ నుంచి పాములు తీసుకొస్తున్న వారిని సెక్యూరిటీ సిబ్బంది ఎందుకు గుర్తించలేకపోయారని అనుమానం వ్యక్తమవుతున్నది. వారిద్దరు పథకం ప్రకారంమే పాములను తీసుకొచ్చారా అనే కోణంలో దర్యాప్తుచేస్తున్నారు.





# ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ముమ్మర ఏర్పాట్లు

## కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి..

## తొలుత అందుబాటులోకి రానున్న మామునూరు ఎయిర్‌పోర్టు

**హైదరాబాద్,నవంబర్25తెలుగు వెలుగు :**

తెలంగాణలో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్‌లోని మామునూరు, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సీఎం రేవంత్ సర్కారు రెడీ అయ్యింది. ఇక కేంద్రంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్‌నాయుడు ఉండడంతో అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే ఛాన్స్ ఉంది. అయితే హైదరాబాద్ తర్వాత తెలంగాణలోనే అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఉన్న మామునూరులో తొలుత ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. తొలి విడతలో మామునూరు ఎయిర్‌పోర్టును చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. వరంగల్ మహానగరం మాస్టర్ ప్లాన్ తయారీకి ఇప్పటికే ఆమోదం లభించింది. మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి ప్రక్రియను 2025 డిసెంబరుకల్లా పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు టార్గెట్‌గా పెట్టుకుంది. ఆ తర్వాత 2027 సంవత్సరం నాటికి రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా మామునూరు ఎయిర్ పోర్టును డెవలప్ చేస్తారు. వాస్తవానికి నిజాం నవాబు పాలనా కాలంలో మామునూరులో ఎయిర్ పోర్టు ఉండేది. దీనికి ఇప్పటికే 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్ పోర్టు కోసం అదనంగా మరో 253 ఎకరాలను సేకరించేందుకు తెలంగాణ సర్కారు రూ.205 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. రాబోయే నాలుగేళ్లలో భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు కూడా అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం మూడు మండలాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో భూసేకరణపై ఓ అంచనాకు వచ్చారు. రామగుండం పట్టణం సమీపంలో ఉన్న బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయిర్‌పోర్టు ఉండేది. బీకే బిర్లా తమ సిమెంట్ పరిశ్రమ సమావేశాలకు రావడానికి దీన్ని అప్పట్లో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కారు యోచిస్తోంది. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు దాదాపు 1,592 ఎకరాల్లో భూమి రెడీగా ఉందని తెలుస్తోంది. అయితే ఈ మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి అనుమతులను పొందాల్సి ఉంది.

# రాజీనామా ప్రచారంలో నిజం లేదు

## మహా వికాస్ అఘాడీ చెక్కుచెదరకుండా ఉంటుంది

## మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే

**ముంబై,నవంబర్25తెలుగు వెలుగు :**



మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘోర ఓటమి చవిచూడడంతో..దీనికి బాధ్యతగా మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆ పార్టీ సీనియర్ నేత నానా పటోలే రాజీనామా చేసారని ఉదయం నుండి పెద్ద ఎత్తున ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ ఘోర పరాజయం నేపథ్యంలో.. ఆయన తన పదవికి రాజీనామా చేసారని, మహారాష్ట్ర ఎన్నికల్లో అధికారం ఖాయమని భావించిన మహావికాస్ అఘాడీ కూటమికి ఊహించనంత గట్టిదెబ్బ తగలడం, కాంగ్రెస్ , శివసేన ఉద్ధవ్ వర్గం, ఎన్సీపీ శరద్ పవార్ కూటమి 46స్థానాలకే పరిమితం కావడం, 101స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 16 సీట్లలో మాత్రమే గెలవడంతో నానా పటోలే రాజీనామా చేసారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని పటోలే ఖండించారు. రాజీనామా చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని , తాను రాజీనామా చేయలేదని%ా% మహా వికాస్ అఘాడీ చెక్కుచెదరకుండా ఉంటుందని తేల్చి చెప్పారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నానా పటోలే 2021లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో.. నానా పటోలే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ.. మొత్తం 48 లోక్‌సభ సీట్లకు గానూ 17 స్థానాల్లో పోటీ చేసింది. అందులో 13 స్థానాలను గెలుచుకుని అద్భుతమైన ప్రదర్శన చేసింది. దీంతో మహా వికాస్ ఆఘాడీ కూటమి ఈసారి ఎలాగైనా మహారాష్ట్రలో అధికారాన్ని చేజిక్కించుకుంటుందని అంతా భావించినా.. అది జరగలేదు. కనీసం ఎగ్జిట్ పోల్స్ సంస్థలు చెప్పిన అంచనాలను కూడా అందుకోవడంలో మహా వికాస్ ఆఘాడీ కూటమి విఫలం అయ్యింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సకోలి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నానా పటోలే కేవలం 208 ఓట్ల తేడాతో గెలుపొందారు.

# లగచర్ల ఘటనలో అమాయకులను జైల్లో పెట్టారు

## కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలి

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**హైదరాబాద్,నవంబర్25తెలుగు వెలుగు :**



లగచర్ల ఘటనలో అమాయకులను జైలులో పెట్టారని, కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సంగారెడ్డి జిల్లా కంది జైలులో లగచర్ల బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బక్కి వెంకటయ్య మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి గ్రౌండ్ లెవల్ రిపోర్టు ఇస్తామని చెప్పారు. లగచర్ల, రోటిబండ తండాలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం పర్యటించిందని, ఇప్పటికీ గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారన్నారు. కలెక్టర్‌పై దాడి ఘటన దురదృష్టకరమని, కానీ అమాయకులను జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించారని, అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి దాడులు చేసి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇది ఎస్సీ, ఎస్సీ యాక్టుకు విరుద్ధమన్నారు. అట్రాసిటీ కేసులపై స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమమంలో దళిత సంఘాల నాయకులు జగన్, దుర్గాప్రసాద్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 5,431 మందికి లీగల్ నోటీసులు

## వాహన యజమానుల పెండింగ్ చలాన్ల డేటా సేకరణ

**వరంగల్,నవంబర్25తెలుగు వెలుగు :**

వరంగల్ నగరంలో నిత్యం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి వారికి లీగల్ నోటీసులు అందజేసే పనిలో పడ్డారు ట్రాఫిక్ పోలీసులు. పోలీసులు తమ వాహనంపై పదికి పైగా చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహన యజమానుల డేటాను సేకరించారు , వారిలో ఇప్పటివరకు 5,431 మందికి లీగల్ నోటీసులు పంపారు. నగర పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమార్కులకు జరిమానాలు విధించడం ద్వారా ఈ పద్ధతిని అరికట్టేందుకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రస్తుత సంవత్సరంలో ట్రాఫిక్ పోలీసులు 1115 మందిపై చార్జిషీట్లు దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచి జరిమానాలు వసూలు చేశారు. నగరంలో అక్రమాలకు పాల్పడిన 71,782 వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయని పోలీసులు గుర్తించి, వాటిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొలుత మూడు చలాన్లు దాటిన వాహనదారులపై చార్జిషీట్లు దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. చలాన్లు చెల్లించకుండా తప్పించుకున్న వాహనదారులను స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకుని వారి వాహనాలను సీజ్ చేశారు. గతంలో రెండుసార్లు చలాన్లపై భారీ రాయితీ ఇచ్చినా చాలా మంది వినియోగించలేదు. ప్రస్తుతం 150 పెండింగ్‌లో ఉన్న చలాన్ వాహనాలు నగర రోడ్లపై తిరుగుతున్నాయని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. జరిమానా విధించిన మూడు రోజుల్లోనే ఇ–చలాన్‌లు స్వయంచాలకంగా కోర్టుకు రిఫర్ చేయబడతాయని, ఉల్లంఘించిన వారిపై ప్రత్యక్ష చర్యలు తీసుకునే అధికార పరిధి పోలీసులకు లేకుండా పోతుందని పోలీసు అధికారులు వెల్లడించారు . పర్యవసానంగా, చలాన్లతో సంబంధం ఉన్న భయ భావం ప్రజల్లో తగ్గిపోయింది.ట్రాఫిక్ పోలీసులు అత్యధిక సంఖ్యలో ఉల్లంఘనలకు పాల్పడుతున్న వాహనాలను గుర్తించారు, చాలా వాహనాలు తక్కువ ప్రభావంతో ఏడాది పొడవునా నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తున్నాయని సూచిస్తున్నాయి. "ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు వాహనాలపై చలాన్‌లు నిరంతరం జారీ చేయబడతాయి , మొత్తం పెరుగుతూనే ఉంటుంది. వాహన యజమాని దానిని విక్రయించడానికి ప్రయత్నించే వరకు ప్రభావితం కాదు, ఎందుకంటే అమ్మకం సమయంలో %=ూ% ద్వారా నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ అందించబడుతుంది , ఆ తర్వాత మాత్రమే పెండింగ్ చెల్లింపులను పరిష్కరించాలి, "అని ఒక అధికారి తెలిపారు. ఈ ఏడాది చివరి వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న చలాన్లన్నీ చెల్లించేలా చూడాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు.



# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

మొదటి పేజీ తరువాయి

వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

**తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం**

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబుతే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

**ఫార్మా విలేజ్ ఎవరి కోసం.....**

ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడున్న డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

**ముంబయి,నవంబర్25తెలుగు వెలుగు :**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 80వేల ఎగువకు చేరింది. నిఫ్టీ 24,200 పాయింట్ల ఎగువన స్థిరపడింది.సెన్సెక్స్ ఉదయం 80,193.47 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,117.11) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 1300 పాయింట్లకు పైగా లాభపడి 80,473.08 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 992.74 పాయింట్ల లాభంతో 80,109.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 314.65 పాయింట్ల లాభంతో 24,221.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ కాస్త బలపడి 84.30కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్‌అండ్‌టీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2672 డాలర్ల వద్ద కొనసాగుతోంది.బీఎస్ఈ సెన్సెక్స్ సూచీలోకి జొమాటోను తీసుకొంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఇవాళ ఆ కంపెనీ షేరు రాణించింది. ఇంట్రాడేలో 7 శాతం మేర లాభపడిన ఆ షేరు.. చివరికి 3.29 శాతం లాభంతో రూ.272.90 వద్ద స్థిరపడింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 2.40 శాతం కుంగి 953.35 వద్ద ముగిసింది.



# 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి..?

మొదటి పేజీ తరువాయి

అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని , ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# ఫుడ్ పాయిజన్‌కి గురైన విద్యార్థిని శైలజ మృతి

## గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

## రేవంత్ సర్కార్ నిర్లక్ష్యానికి బలైన విద్యార్థిని

## మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ.. విద్యార్థికి కన్నీటి నివాళి

**హైదరాబాద్,నవంబర్25తెలుగు వెలుగు :**



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన అశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కి గురై గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మృతి ) చెందింది. అక్టోబర్ 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. రిలో ఇద్దరు కోలుగా శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు 20 రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాత పడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువు ల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకుల పాఠశాలలు అధ్వాన్నంగా మారి విద్యార్థులు చనిపోతున్నారని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి బలైపోయిన వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. మీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతదన్నారు. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్ మీద అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.శైలజ తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చిండు సీఎం రేవంత్ రెడ్డి. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. విషాహారం వల్ల కన్నుమూయటం కలిచి వేస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకులంలో నాణ్యత లేని భోజనం పెట్టడం పాపం కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడం మరొక పాపం. అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. నిమ్స్ ఆసుపత్రిలో బిడ్డను పట్టుకొని అక్కడే ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంలోనూ కాంగ్రెస్ సర్కార్ పూర్తి వైఫల్యం చెందింది. చివరకు ఆ అమ్మాయి చావును కూడా దాచి పెట్టాలనే ఉద్దేశంతో, దొంగ చాటున మృతదేహాన్ని తరలిస్తుండడం సిగ్గుచేటు. గిరిజన విద్యార్థినీ కుటుంబానికి బాధ్యత వహించి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# పరారీలో రామ్‌గోపాల్ వర్మ?

## తమిళనాడులో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు

**అమరావతి, నవంబర్ 25 తెలుగు వెలుగు :**



దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పరారీలో ఉన్నట్టు ప్రకాశం జిల్లా పోలీసులు అనుమానిస్తున్నారు. రెండుసార్లు విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్టు ఖాయమని గ్రహించిన ఆయన తప్పించుకుని తిరుగుతున్నారని భావిస్తున్నారు. అందుకే ఆయన ఎక్కడ ఉన్నా సరే పట్టుకోవాలని చూస్తున్నారు. అయితే ఇప్పుడు పోలీసులకు అందుకున్న సమాచారం ప్రకారం తమిళనాడులో ఆర్జీవీ ఉన్నారని తెలుస్తోంది. అందుకే ఆయన్ని అక్కడే పట్టుకోవాలని చూస్తున్నారు. తమిళనాడులో ఉన్న ఆర్జీవీ అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అక్కడి పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా నమోదు అయిన కేసుల వివరాలు, కోర్టు తీర్పులను పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు ఆయన అరెస్టుకు సహకరించాలని వారిని కోరబోతున్నారు. ఆర్జీవీ ఇంట్లోనే విచారణ చేసేందుకు ప్రకాశం జిల్లా పోలీసులు హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వచ్చారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయారని సిబ్బంది తెలియజేశారు. ఎక్కడికి వెళ్లారని ఆరా తీస్తే తమకు తెలియదని చెప్పారు. అయితే పోలీసులు వారిని విచారించి ఆర్జీవీ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై వివరణ ఇవ్వాలని విచారణకు రావాలని ఇప్పటికే రెండుసార్లు ఒంగోలు పోలీసులు ఆర్జీవి నోటీసులు జారీ చేశారు. తనకు షూటింగ్ ఉన్నందున విచారణకు హాజరుకాలేనని మొదటి సారి పోలీసులకు సమాధానం చెప్పారు ఆర్జీవి. రెండోసారి నోటీసులు జారీ చేశారు. దాని ప్రకారం ఇవాళ హాజరుకావాల్సి ఉంది. దీంతో ఆయన విచారణకు హాజరుకాకపోవడంతోపాటు మరో రెండు వారాల సమయం కావాలని కోరినట్టు చెబుతున్నారు. విచారణకు ఆర్జీవీ మరింత సమయం అడగడంతో పోలీసులు నేరుగా ఆయన ఇంటికి వచ్చారు. ఇలా ఇంటికి రావడంపై ఆర్జీవీ అడ్వకేట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో పిటిషన్ల విచారణ పెండింగ్‌లో ఉందని మరో రెండు వారాలు గడువు కూడా కోరామన్నారు. దీనికి సమాధానాలు చెప్పకుండా నేరుగా ఇంటికి రావడమేంటని అంటున్నారు. తాము డిజిటల్ విచారణకు అంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతామని కూడా చెప్పినట్టు వెల్లడించారు. వీటికి అంగీకరించకుండా నేరుగా రావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెబల్‌గా ఉంటూ నాకు నచ్చిందే చేస్తా... నచ్చినట్టు బతుకుతా అనే ఓ వర్గానికి డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ ఇన్‌స్పిరేషన్. భయమనేది తన బ్లడ్‌లోనే లేదు అంటూ చెప్పుకొచ్చే వర్మలో భయం మొదలైందనే చర్చ నడుస్తోంది. ప్రత్యర్థులపై మెయిన్ మీడియాలో ఇంటర్వ్యూల ద్వారా, సోషల్ మీడియా పోస్టుల ద్వార చెలరేగిపోయే ఆర్జీవీ ఇప్పుడు డిఫెన్స్‌లో పడ్డారు. సోషల్ మీడియా పోస్టుల విషయంలో తనకు వచ్చిన నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీవీ తనను అరెస్టు చేస్తారేమో అని అనుమానం వ్యక్తంచేశారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అవకాశం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడే ఆర్జీవీకి భయం మొదలైందని కూటమి శ్రేణులు కామెంట్స్ చేశాయి. ఇప్పుడు పోలీసులకు చిక్కకుండా పారిపోవడంతోపాటు నేరుగా విచారణకు హాజరుకాబోనని... డిజిటల్ విచారణకు ఓకే చెప్పడం కూడా అందుకే అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్‌కు అనుకూలంగా చిత్రాలు తీసిన ఆర్జీవీ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫ్యామిలీపై వివాదాస్పద పోస్టులు పెట్టారు. ఎవడైతే నాకేంటి అన్నట్టు కామెంట్స్ చేయడమే కాకుండా సోషల్ మీడియా పోస్టులు కూడా పెట్టారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టేలా వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టులు ఇప్పుడు ఆర్జీవీ మెడకు చుట్టుకుంటున్నాయి.

Editor: Gunnala Anil Reddy Address: Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy (Dist) Telangana

Cell: 9705043131, 9948462690